# మిసిమి

మాస పత్రిక

డిశంబరు 1991 వెల రూ.3



## ఇంద్రజిత్ విజయం

చిత్రకారుడు:
రాజా రవివర్మ



చిత్రకారుడు రాజా రవివర్మ

మాతా, శిశువు    చిత్రశాల, మైసూర్

# మిసిమి

***"All that we are is the product of what we have thought," is "We are what we think."*** **– Dammapada.**

సంపుటి 2 | డిశంబరు 1991 | సంచిక 29

## విషయసూచిక

శూన్యవాదం – ఏటుకూరి బలరామమూర్తి

చిత్రస్రష్ట
రాజా రవివర్మ – డా॥ సంజీవ్‌దేవ్

సర్వేసర్వత్రా
విలువల విధ్వంసం – రవీంద్రనాథ్ ఆలపాటి

స్వేచ్ఛ – డా॥ బెజవాడ గోపాలరెడ్డి

చలంతో–మధురవాణి – పురాణం సుబ్రమణ్య శర్మ

సంపాదకునికి ఒక లేఖ – చీమకుర్తి శేషగిరిరావు

ముఖచిత్రం:
ఇంద్రజిత్ విజయం
చిత్రకారుడు - రాజారవివర్మ

వార్షిక చందా రూ.40/-

Printed, Published and Edited by Shri ALAPATI RAVINDRANATH for and at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, Ifterkar Mansion Lane, R.T.C. X Roads, Musheerabad, Hyd-20. Ph. 64220, 64337.

**Editorial NEST**
B-15, Journalist Colony, Jubilee Hills, Hyderabad-500 034. Ph. 247717

# Food for Thought

MAHATMA GANDHI SAID

"I have made the world's faith in God my own. I have no word for characterizing my belief in God." Then "I call God long suffering and patient because. He permits evil in the world". Again: "God is the law as well as the law-giver. The two are one." Finally, "truth triumphs over untruth. Love conquers hate. God eternally triumphs over Satan". The author contends that the Gandhian conception of a "suffering God" leaves no room for "creatorship to be an essential function of Godhood". His "great contribution to humanism consists in conceiving a religion that centres almost wholly around man and his life here in this world".

M.N. Roy thought Gandhi was "rather a humanitarian than a humanist". This he stated in an article in Independent India of March 27, 1949, while reviewing "Gandhiji's last Discussion with Fellow Workers". Roy's arguments were as follows: "The Mahatma did not regard man as the end in himself, but as the means for the operation of the purpose of God". During that discussion held hardly two months before his assassination, Pyarelal reports Gandhi exclaiming penitentially: "God had purposely sealed my eyes as He wanted to accomplish. His great purpose through me. That purpose having been accomplished, He has restored to me my sight."

# శూన్యవాదం

- ఏటుకూరు బలరామమూర్తి

*(బలరామమూర్తిగారు 1918లో జన్మించారు. సోషియాలజీలో M.A పట్టం పుచ్చుకొన్నారు. 1952 నుంచి 1970 వరకు విశాలాంధ్ర దినపత్రిక సంపాదకులుగా వ్యవహరించారు. 1949-52 జైలు జీవితం.*

*వీరి ''భారతీయ తత్త్వశాస్త్రం'' సుప్రసిద్ధం. ''ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర'', ''మన చరిత్ర'' ఇతర రచనలు. వీటిలో ''ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర'' రష్యన్ భాషలోకి అనువదించబడింది.)*

తత్వశాస్త్రంలో రెండు మౌలిక సమస్యలున్నాయి. మూల వస్తువు పదార్థమా, భావమా? అది స్థాణువా, జంగమమా?

సృష్టికి మూలాధారమైన వస్తువు పదార్థము అన్నవారు భౌతికవాదులు. భావము అన్నవారు భావవాదులు. మూలవస్తువు నిరాకార, నిర్గుణ, చలరహిత స్థాణువు అన్నవారు జడవాదులు. పుట్టుక, పెరుగుట నశింపులతో కూడిన జంగమము అన్నవారు గతివాదులు. స్థాణువే స్థితి; జడవాదులే స్థితివాదులు.

భావవాదం, భౌతికవాదం తాత్విక దృక్పథాలు. జడవాదం, గతివాదం పరిశీలనా పద్ధతులు. భావవాదులలో జడవాదులున్నారు. శాంకరాద్వైతులు వారిలో ప్రథమగణ్యులు. గతివాదులూ ఉన్నారు.

ఉపనిషత్తులలోని జగద్వాదులు అట్టివారు. జగత్ అంటే నిత్యమూ కదిలేది.

ఇవి కేవలము మేధోప్రధానమైన తాత్విక సమస్యలు కావు. ఆయా కాలాలలో ఈ ధోరణుల కన్నిటికీ సామాజిక ప్రతిస్పందన ఉంటూనే వచ్చింది. బోధకులు ఉద్దేశించిన ఫలితాలు కొన్ని, శ్రోతలకు స్ఫురించిన అంతరార్థాలు, అంతర్ధ్వనులు మరికొన్ని.

సృష్టికంతా మూలం భావం - (being) - అని ఉపనిషత్తులలోని ప్రధాన బోధన. నిర్గుణమైన ఏకైక పరబ్రహ్మం నుండి చరాచరాత్మక సృష్టి యావత్తు విశ్వరూపంలో వికసించింది. నిర్గుణమైనది సగుణ సృష్టికి హేతువు కాగలదా? ఇందుకు ఉపనిషత్కారుల సమాధానము - అదొక లీల. ఎవరి లీల? నిర్గుణ బ్రహ్మకు లీల ఉండగలదా? సగుణాత్మకమైన పురుషునికే గదా లీల - భ్రాంతి లాంటివి సంభవం? దాంతో నిర్గుణబ్రహ్మ సగుణబ్రహ్మ అయినాడు.

ఇందుకు విరుద్ధంగా బుద్ధుడు ఇలా అన్నాడు. ''అది అలా ఉంది కనుక, ఇది ఇలా ఉంది. అది లేకపోతే ఇది లేదు. అదీ, ఇదీ కార్యకారణ బంధితము. అకారణంగా ఏదీ జరుగదు. కార్యము ఏర్పడిన మీదట కారణము నశిస్తుంది. కార్యము తిరిగి కారణమౌతుంది. మరొక కార్యం ఏర్పడుతుంది. తుది మొదలులేని అనంత క్రమం ఇది''

''మూల వస్తువు స్థితి కాదు, గతి (becoming). పుట్టుక, పెరుగుదల, నశింపుల సంపుటి గతి. ఇందులో ప్రతి దశ క్షణికం. మానవ మేధస్సు ఊహించనైనా లేనంతటి స్వల్పకాలం. క్షణికం అనగా శూన్యం కాదు. పృథకీకరణలో ఒక స్వల్పాతి స్వల్ప ప్రమాణం. ఐనా వాస్తవం''

''ఒకే వస్తువు నుండి, అందునా నిర్గుణాత్మకమైన స్థితినుండి విశ్వవికసనం జరిగిందనటం హేతువిరుద్ధం. అనేక కారణాల సమాహారం నుండి కార్యం ఉద్భవిస్తుంది. కారణ సముదాయం ఫలితమే సముత్పాదం''.

దీనినే ప్రతీత్యసముత్పాదమని, కారణ సముదాయ సూత్రమని బౌద్ధనికాయాలు పేర్కొం టున్నాయి.

ఆనాటికీసూత్రం చెప్పింది గౌతమ బుద్ధుడే; చార్వాకుడు చెప్పలేదు. వారిలో హెచ్చు మంది నియతివాదులు (Determinists). జిన మహావీరుడు చెప్పలేదు. అతడు పుద్గలమ న్నాడు. పదార్థమౌలికతను గుర్తించాడు. కాని గతి ప్రాధాన్యము చెప్పలేదు.

కనుకనే ఆది బౌద్ధం భారతీయ తాత్విక చింతనలోని ఏకైక గతివాదం. ఆత్మను, దేవుని వేదాలను నిరాకరించినందున నాస్తికవాదం కూడా. పదార్థం, భావం రెండూ పరస్పరాశ్ర యాలు. ''ఏది మౌలికమనే ప్రశ్న ఉదయించదు'' అని చెప్పినందున భౌతికవాద మనలేము. భావవాదమూ అనరాదు. ఆ విషయంలో అస్పష్టత ఉండనే ఉంది.

ఆది బౌద్ధం అనే మాటను ఇక్కడ నొక్కి చెప్పాలి. బుద్ధుడు సంచార ప్రచారకుడు. తోచినవన్నీ 40 యేండ్లపాటు బోధల రూపంలో చెప్పుకుంటూ పోయాడు. శిష్యులు అవన్నీ మనోగతం చేసుకున్నారు. వీటిని గ్రంథస్థం చేయటానికి ప్రథమ సంగీతి, బుద్ధుడు మరణించిన తర్వాత 43 ఏండ్లకు, క్రీ.పూ. 500లో జరిగింది. బుద్ధుని కాలం క్రీ.పూ. 623-543.

రాజగృహంలో జరిగిన ఈ ప్రథమ సంగీతిలో వినయపిటకం, సుత్తపిటకం మాత్రమే గ్రంథస్థమయ్యాయి. భిక్షువుల దైనందిన నియమనిష్ఠల క్రోడీకరణ వినయం. బుద్ధుడు స్వయంగా చెప్పిన కథలు, బోధలు, సూక్తుల క్రోడీకరణ సూత్రపిటకం. త్రిపిటకాలలో మూడవదిగా నేడు చెప్పబడుతున్న అభిధర్మ పిటకం అప్పటికేర్పడలేదు.

అప్పటికే బౌద్ధంలో విభేదాలు తలెత్తాయి. భిక్షువుల నియమనిష్ఠలు జీవన విధానం - నాటి ప్రధాన చర్చనీయాంశాలు. ప్రథమ సంగీతి బుద్ధుని రథసారధి ఛన్నుని బౌద్ధ సంఘం నుండి బహిష్కరించింది. అంతేవాసి ఆనందుని మందలించింది. మంగలి ఉపాలి మాత్రమే వినయపిటకాన్ని విశ్వాసపాత్రంగా పునశ్చరణ చేయగలిగాడట.

క్రీ.పూ. 400లో వైశాలిలో ద్వితీయ సంగీతి జరిగింది. అల్పసంఖ్యాకులైన థేరవాదులు అధిక సంఖ్యాకులైన మహాసాంఘికులను బహిష్కరించారు. థేరవాదులు నైష్ఠికులు; మహాసాంఘి కులు లౌకిక ప్రవృత్తిపై మొగ్గు జూపిన వారు.

అశోకుని కాలంలో మూడవ సంగీతి జరిగింది. అప్పటికే (క్రీ.పూ. 250) పదకొండు బౌద్ధశాఖలు తలెత్తాయి. వీరిలో ఒక శాఖ వాత్సపుత్రీయ. అనాత్మవాద ప్రధానమైన బౌద్ధంలో వీరు ''ఆత్మ'' పదాన్ని ప్రవేశపెట్టారు. ఈ పదకొండు శాఖలను థేరవాదులు బహిష్కరిం చారు.

బహిష్కృతులు ఒకరూ ఇద్దరూ కాదు. అరవై వేలమంది. వీరు నలందా విశ్వవిద్యాలయం చేరారు. సర్వాస్తివాదులుగా పేరు పొందారు.

కార్యం సృష్టియైన తర్వాత కారణం నశిస్తుంది అన్నది ఆది బౌద్ధం. కాదు, కారణం శాశ్వతంగా ఉంటుంది, కార్యమూ ఉంటుంది అని వాదించిన వారు సర్వాస్తివాదులైనారు.

బుద్ధుడు అంతవరకు మహాబోధకుడు. సర్వాస్తివాదులు బుద్ధునికి శాశ్వతత్వం, దేవత్వం ఆరోపించారు. బోధిసత్వులు ఏర్పడ్డారు. దేవుడు లేడని చెప్పిన బుద్ధునే దేవుడిని చేసారు. శాశ్వత పదార్థం లేదని చెప్పిన బౌద్ధంలో శాశ్వత పదార్థం ఏర్పడ్డది. కొందరు దానిని బాహాటంగా ఆత్మ అన్నారు. ఆ పదం బౌద్ధానికి వ్యతిరేకం. కనుక అదే అర్థాన్ని స్ఫురింపజేసే కొత్త పదాలు ఏర్పడసాగాయి.

మూడవ సంగీతిలో అభిధమ్మపిటకం రూపొందింది. బుద్ధుని సూత్రాలలోని తాత్వికాంశాల సాధారణీకరణ అభిధమ్మం. ఇది మూడో పిటకం. అప్పటి నుండే త్రిపిటకాలు అనే మాట ఏర్పడ్డది. ఈ సాధారణీకరణతో ఆదిబౌద్ధానికి విరుద్ధమైన అనేక భావాలు ప్రవేశించాయి. మతరీత్యా హీనయానం వెనుకడుగు వేసి మహాయానం ఏర్పడ్డది.

నాలుగో సంగీతి క్రీ.శ. 100లో జరిగింది. గత మూడు సంగీతులలో థేరవాదులచే బహిష్కృతులైన బౌద్ధులు నాలుగో సంగీతిలో అధికారపీఠం ఆక్రమించారు. థేరవాదులు పదభ్రష్టులైనారు.

ఇలా పదభ్రష్టులైన వారు మతరీత్యా హీనయానులు, తాత్వికంగా సౌత్రాంతికులు. బుద్ధుని సూత్రాలే వీరికి ప్రమాణం. అందులో గతివాదం, వాస్తవికత, భౌతికవాద ఛాయలు హెచ్చు. అభిధమ్మ పిటకంలో అవన్నీ నశించాయి. అభిధమ్మం వ్యాఖ్యానం. అభిధమ్మ పిటకమే మాకు ప్రమాణం అన్నవారు వైభాషికులు. వీరికి మూలం కంటె విభాష అనగా వ్యాఖ్యానం ప్రమాణం, కనుక వీరు వైభాషికులు.

మూలబౌద్ధం రూపురేఖలు అన్నిటా నశించాయి. నాలుగో సంగీతి నాటికి మాధ్యమిక వాదం అనే మాట వినిపించలేదు. కొద్దికాలం తర్వాత అశ్వఘోషుడు మొదటిసారి ఈ పదం వాడాడు.

ఈ మాటను పెంచి పెద్దచేసి తాత్విక ధోరణిగా ప్రతిష్ఠ కల్పించిన వాడు నాగార్జునాచార్యులు. మాధ్యమిక వాదానికి పర్యాయపదం శూన్యవాదం. క్రీ.శ. 200లో యజ్ఞశ్రీ శాతకర్ణికి సమకాలికుడు నాగార్జునాచార్యులు.

బుద్ధుని తర్వాత 700 సం.లకు జన్మించిన వాడు నాగార్జునుడు. మతరీత్యా బౌద్ధం అప్పటికే వైదికమతంలోని మౌఢ్యాలన్నిటినీ స్వీకరించింది. బౌద్ధంలోని తాత్విక ప్రత్యేకతను రూపుమార్చి వైదిక తత్వశాస్త్రానికి సన్నిహితం చేయడం మిగిలివుంది. నాగార్జునుడు ఆ పనిచేశాడు. ఆదిబౌద్ధం దృష్ట్యా ఇది పతనం; తాత్విక పరిణామం దృష్ట్యా ప్రతీపగమనం. నాగార్జునాచార్యుని దృష్టిలో మాత్రం తాత్విక పరిశీలనకు పరాకాష్ఠ.

ప్రతిదీ కార్యకారణ జనితం. కారణం లేనిదే కార్యం లేదు. పుట్టుక, పెరుగుదల, నశింపులేని వస్తువే లేదు. మొదలు, తుది అనే ప్రశ్నలే వేయరాదు. ఆద్యంతరహిత సృష్టికి మొదలేది, తుది ఏది? ప్రతీత్య సముత్పాదసారాంశ మిది.

నాగార్జునాచార్యులు ఈ ప్రశ్ననే వేశారు. స్థూల దృష్టిలో కూడదన్న ప్రశ్నను (Macro view) సూక్ష్మదృష్టిలో (Macro view) వేశారు. ప్రతిదీ పరస్పరాధారితం. మౌలికంగా మరొక

దానిపై ఆధారపడకుండా ఏ వస్తువుకూ, ఘటనకూ దృగ్విషయానికి అస్తిత్వమే లేదు. కనుక అది నిస్వభావం. అదే శూన్యం.

స్థూలంగా చూస్తే ఈ వాదనలో దోషమున్నట్లు తోచదు. ప్రతీత్యసముత్పాదానికి పర్యాయపదంగా శూన్యం అనే మాట వాడాడు. ఇందులో దోషమేమని అనిపించవచ్చు. కాని అందులోనే దోషమున్నది.

గతివాదం ఒక ఆలోచనా పద్ధతి; పరిశీలనాక్రమం (methodology). ఏ వస్తువును విడి విడిగా, చలనరహితంగా, బాహ్యపరిస్థితుల నుండి వేరుచేసి పరిశీలించవద్దు అని గతివాదం నిషేధిస్తుంది... ఎందువలన? అలా చూడడానికి ప్రయత్నించడంలోనే లోపం వున్నది. గతి కంటే, మౌలికమూ, ప్రాథమికమూ ఐన స్థితి అనే అంతర్ధ్వని అందులో ఉన్నది కనుక.

ఆధునిక విజ్ఞానశాస్త్రం దృష్ట్యా చూస్తే గాని ఈ సమస్య లోతుపాతులు బోధపడవు.

సృష్టికి మూలం 'పదార్థం' అని భౌతికవాద తత్వవేత్తలు అన్నారు. జైనులు పుద్గలం అన్నారు. గ్రీకు తత్వవేత్తలు నీరు, నిప్పు వాయువని ఏవేవో అన్నారు.

ఆ చర్చ కొన్ని శతాబ్దాలు సాగి ఆగిపోయింది. ఆగిపోక తప్పదు. ఆ సమస్య ఆనాటి తత్వవేత్తల పరిధికి అతీతమైనది. శాస్త్రవేత్తలు మాత్రమే మరికొంత ముందడుగు వేయగ లరు.

18, 19 శతాబ్దాలలో భౌతిక రసాయనిక శాస్త్రాలు వృద్ధిచెందాయి. పరిశీలన, ప్రయోగం, వివేచన ఫలితంగా పదార్థానికి మూల రూపం అణువనీ, పిమ్మట పరమాణువనీ, శాస్త్రజ్ఞులు అన్నారు. పరమాణువు అవిభాజ్యం. (Atom is indivisible) అని ఊరుకున్నారు, పరమ జ్ఞానం సాధించామనుకున్నారు.

కొద్ది రోజులలోనే పరమాణువు విభాజ్యం అని నిరూపణయైనది. దాని విభాగాలు ఎలక్ట్రాను, ప్రోటాను, న్యూట్రానులు అన్నారు. అణువిద్యుత్ సంఘాతాల రూపంలో ఇవి నిత్యం చలనశీలంగా ఉంటాయన్నారు. అవిభాజ్యత కాదు, విభాజ్యత; స్థితికాదు, గతి మౌలికం అని శాస్త్రజ్ఞానం నిరూపిస్తుంది.

కాలము, దేశము (Time and space) స్థిర దృగ్విషయాలనీ, ఈ అనంతాకాశంలో పరిభ్రమిస్తూ ఉంటాయని న్యూటన్ కాలపు భావన. ఐన్‌స్టీన్ ఒక అడుగు ముందుకు సాగి, దేశకాలాలు కూడా సాపేక్షకాలే తప్ప నిరపేక్షక దృగ్విషయాలు కావని తేల్చేడు. (Motion is the mode of existence of matter) చలనం పదార్థం యొక్క రూపం. చలనరూపంలో తప్ప పదార్థం ఉండజాలదు. పదార్థ రహిత చలనమూ లేదు. చలనం అంటే యాంత్రిక చలనం మాత్రమే కాదు. భౌతిక, రాసాయనిక, జైవిక, మానసిస పరిణామాలన్నీ చలన రూపాలే.

ప్రాచీనకాలంలో ఇలాంటి విజ్ఞానశాస్త్రాభివృద్ధిలేదు. బుద్ధుని కాలం నాటికి మరీ స్వల్పం. అయినప్పటికీ కేవలం తాత్విక, సాంఘిక, మతపరమైన ఆలోచనచేసి నానావిధాలైన మథనకు జిజ్ఞాసకు లోనై (దానినే తపస్సు అన్నారు) బుద్ధుడు తాత్విక రూపంలో ప్రాథమికమైన గతివాదాన్ని బోధించాడు. శూన్యవాదాన్ని నిరూపించడానికి నాగార్జునాచార్యులు చేసిన వాదాన్ని చూడండి.

''నేను నడుస్తున్నాను'' అనే మాటలో నేను 'గంత' అనగా నడుచువాడు

నడుస్తున్నాను - అనేది గమనం, గతిచేరుకునే ప్రదేశం గమ్యమానం.

ఈ క్రమాన్ని శతధా విశ్లేషించి అత్యల్ప త్రుటికాలాన్ని ఊహించుకుందాం. అప్పుడు తర్కం ఇలా సాగుతుంది.

''దేవదత్తుడు గమిస్తున్నాడు, (నడుస్తున్నాడు).'' అతని నడక ఎప్పుడు ప్రారంభమైంది? గతమునందా? ఆగతమునందా? గతము నందు అనలేము. ఏల? భూతవర్తమానములకు విరోధము గనుక. ఆగతమునందు అనరాదు. భవిష్యత్తు వర్తమానములకు విరోధము కదా... గమ్యమానం (నడక) లోనా? గతాగత రహితమైన గమ్యమానముండజాలదు గదా! కనుక గతి లేదు.

అలాగే స్థితి లేదు. దేశం లేదు. మనం ఉన్న వనుకున్న వేవీ లేవు. కాని ఇవి అన్నీ కంటికి కనిపిస్తున్నవి కదా! ఈ కనిపించుట సంవృతి సత్యం.

పారమార్థిక సత్యం కాదు. వ్యావహారిక సత్యం, సాపేక్షక సత్యం మాత్రమే. అఖండ సత్యం కాదు. అఖండ సత్యం శూన్యం.

గతానికి - వర్తమానానికి, వర్తమానానికి - భవిష్యత్తుకు, విరుద్ధమని నాగార్జునుడు ఎందుకు ఊహించాలి? అసలీ మాట ఎవరు చెప్పారు?

గతము, వర్తమానము, భవిష్యత్తు - అవినాభావమైన ప్రవాహ సదృశ్యమైన దృగ్విషయమని ఆదిబౌద్ధంలోని మూల సూత్రం. అదే ప్రతీత్య సముత్పాదం. ఒకటి నశించి, రెండవది పుట్టడం నిరంతరం జరుగుతుంది. నశింపు నిరోధమైతే, పుట్టుక కొనసాగింపు. ఎంత అత్యల్ప త్రుటికాలంలోనైనా ఈ పరస్పర సంపుటి ఉండనే ఉన్నది. ఇందులో ఒక అంశాన్ని స్వీకరించి మరొక అంశాన్ని నిరాకరించడం ఆదిబౌద్ధానికి అపచారం, తర్కానికి విరుద్ధం. నాగార్జునునికి పూర్వుడైన (క్రీ.శ. 100) నాగసేనుడు, మీనాందార్ రాజు ఆస్థానంలో ఇదే అంశాన్ని ఇలా తర్కించాడు.

''ఓ రాజా, నీవు చిన్నప్పుడు శిశువుగా ఉండే వాడవు. ఇప్పుడు పెద్దవాడవైనావు. ఆనాటి శిశువు, ఈనాటి నీవు, ఒకరా, ఇద్దరా?''

అందుకు రాజుకు సమాధానం తోచలేదు.

నాగసేనుడు సమాధానం చెప్పాడు. ''ఆనాటి శిశువు లేనిదే నీవు ఎలా వచ్చావు? కనుక ఇద్దరకూ సామ్యమున్నది. కాని వయస్సులో, బలంలో, తేజస్సులో, శక్తిసామర్థ్యాలలో అన్నిటా నీవు శిశువుకంటే చాలా ఉన్నతుడవు. కనుక వ్యత్యాసమున్నది. సామ్యాన్ని వ్యత్యాసాన్ని కలుపుతూ పరిణామమనే బంధనం, కార్యకారణ సంబంధం ఉంది. ఇదే వాస్తవం. ఇదే ప్రతీత్యసముత్పాదం. దీనిని మొత్తంగా క్రమంగా చూడాలి''.

నాగసేనుడు, మాధ్యమికుడు కాదు; సౌత్రాంతికుడు. కనుక ప్రతీత్యసముత్పాద సూత్రాన్ని అమలిన రూపంలో చెప్పగలిగాడు. ఆ తరువాత ఒక శతాబ్దికి అదే ప్రశ్నను నాగార్జునుడు వేసుకొని పరిణామం శూన్యం అనే స్థితికి వచ్చాడు.

ఆదిబౌద్ధం వాస్తవికతపై ఆధారపడ్డది.

మాధ్యమికం జడతర్కంపై ఆధారపడ్డది.

గతి మౌలికమూ అంటే సామాజిక ప్రగతి వాస్తవం ఔతుంది. గతి శూన్యం అంటే ప్రగతి భ్రాంతి మాత్రమే. నాగార్జున శూన్యవాదం భ్రాంతివాదానికి సామాజిక స్తబ్ధతకు దోవతీసింది.

నశింపుకు, పుట్టుకకు విరోధం ఊహించటమే నాగార్జునుని ప్రధాన దోషం. ఈ దోషాన్ని ఆయన ఉపనిషత్తులనుండి స్వీకరించాడు. బౌద్ధానికి అంటగట్టాడు. నాగార్జునుడు మొదట వైదిక పండితుడై, ఆ తర్వాత బౌద్ధుడయ్యాడని అంటారు.

బుద్ధుని కాలంలోనే పెక్కుమంది వైదిక పండితులు, బ్రాహ్మణ మేధావులు, ఉపనిషత్తుల లోని జడతత్వం జీర్ణించుకున్నవారు పెద్దసంఖ్యలో బౌద్ధంలో చేరారు. మహాకశ్యపుడు, సారిపుత్ర, మొగ్గలానలాంటి వారందరూ అట్టివారే.

బౌద్ధంలోని గతితర్కం బలహీనమైనది. ప్రాథమిక మైనది. దానిని అంటిపెట్టుకోడం ప్రయత్నసాధ్యం. కరుణ, మానవత, వర్ణ వ్యవస్థ నిరసన వంటివి ప్రబలమైనవి. కనుకనే ప్రథమ, ద్వితీయ, తృతీయ సంగీతులు జరిగే నాటికి గతితర్కం వెనుకడుగు వేసి ప్రాచీనమైన **జడతర్కం** ఆ చోటును ఆక్రమించుకుంది. మానవతాభావం మాత్రం కొనసాగుతూనే వుంది.

జడతర్క మంటే ఏమిటి? శాశ్వత స్థిరసత్యానికై అన్వేషణ. యాజ్ఞ్యవల్క్యమునికి, గార్గికి జనకమహారాజు ఆస్థానంలో జరిగిన చర్చలో మూలవస్తువు ఏది అనే తర్కం మొదలైంది.

పోయి పోయి యాజ్ఞ్యవల్క్యుడు ఆత్మ అన్నాడు. ఆ పిమ్మట బ్రహ్మ అన్నాడు. ఆ పిమ్మట ఏమి అని గార్గి అడిగింది. ఆ ప్రశ్న వేసిందే కాని అందుకు సమాధానం గార్గికి తెలియదు, యాజ్ఞ్యవల్క్యునికి తెలియదు. ఆనాటి తాత్విక స్థాయికి మించిన ప్రశ్న. దాంతో యాజ్ఞ్యవల్క్యునికి కోపం వచ్చి శపించాడు. గార్గి నిరుత్తర ఐంది.

ఇదే ప్రశ్న బుద్ధునికీ వచ్చింది. అందుకు ఇలా అన్నాడు. ''మూలవస్తువేది అనేది తేలని చర్చ. నాకు తెలిసింది నేను చెప్పాను. భవిష్యత్తులో ఎవరైనా ఇంకేమైనా చెబుతారేమో! ధర్మం అపారమైనది. ప్రస్తుతానికి ఇంతే. తేలని సమస్యలతో తలలు బద్దలు చేసుకోవడం ఎందుకు?''

బుద్ధుని తాత్వికవినయం ఇందులో కనిపిస్తుంది. బుద్ధుని తర్వాత వచ్చిన పూర్వ, ఉత్తర మీమాంసాకారులకు ఈ వినయం లేదు. ఏదో సమాధానం చెప్పడానికి ఏవేవో కల్పనలు చేశారు.

శాశ్వత స్థిరవస్తువుకై అన్వేషణ, "Searching in a dark room, for a black cat which is not there" లాంటిది.

యూరప్‌లో కాంట్ అను తత్వవేత్త మూలవస్తువు అజ్ఞేయం అని సమాధానం ఇచ్చాడు. మూలవస్తువు తర్కానికి అందేది కాదు. అపరావిద్య ద్వారా పరోక్షానుభూతి ద్వారా గ్రహించవలసిన సత్యం అని శంకరుడు అన్నాడు. నాగార్జునుడు శంకరుని వాదానికవసరమైన ప్రాతిపదికను శూన్యవాదం ద్వారా ఏర్పరచాడు.

ఈ ప్రశ్నకు సమాధానం ఉందా? ఉన్నది. తెలియని వస్తువు ఎప్పుడూ ఉంటుంది. తెలియజాలని వస్తువు మాత్రం లేదు. unknown వున్నది. unknowable లేదు. జ్ఞాన సంపాదన నిరంతర కృషి. సాపేక్షజ్ఞానం నిరంతర అఖండ జ్ఞానదిశగా పురోగమిస్తుంది.

అఖండ జ్ఞానమంటూ పూర్వ నిర్ణీత వస్తువేదీ లేదు. అలా వుందనడం హెగెల్ వాదనలోని పొరపాటు. విశ్వవిజ్ఞాన అనంతత్వానికి పర్యాయపదం - అఖండ జ్ఞానం. సమాజం ఆ స్థితికి ఎప్పటికీ చేరుకోలేదు. ''పూర్ణస్య పూర్ణ మాదాయ పూర్ణమేవావశిష్యతే'' అను ఉపనిషద్వాక్యంలో అనంతత్వం స్ఫురిస్తుంది. మానవునితోపాటు అతని కంటె ముందు వేగంగా, ప్రకృతి, విశ్వం పరిణామం చెందుతున్నాయి. ఈ మహాప్రస్థానంలో అంతిమ బిందువు అంటూ లేదు. నిరంతర యాత్ర, జ్ఞానాన్వేషణ మాత్రమే ఉన్నాయి.

తెలియని వస్తువును unknowable అని కాంట్, ''శూన్యం'' అని నాగార్జునుడు, ''అనిర్వచనీయ పరబ్రహ్మ'' అని శంకరుడు అనడం, వాస్తవ జ్ఞానాన్ని నిరాకరించడమే. తెలియనిది కొంత వున్నది. గనుక తెలిసిందంతా మిథ్య, క్షణికం, అసత్యం, అవిద్య అనడంలోనే భావవాదతాత్త్వికుల ప్రధాన బలహీనత.

శూన్యవాదం ప్రతిపాదించిన నాగార్జునుడు రెండు సత్యాలను చెప్పక తప్పలేదు. వాస్తవ జగత్తుకు ఏదో వ్యాఖ్యానం ఇవ్వాలి కదా. కనుకనే 'సంవృతి సత్యం' అనే మాట ఏర్పడ్డది. దీనినే శంకరుడు 'వ్యావహారిక సత్యం' అన్నాడు.

సత్యం రెండు విధాలు అని ఉపనిషత్కారులు చెప్పలేదు. శంకరుడు మినహా మిగతా వైదిక దర్శనకారు లెవ్వరూ చెప్పలేదు. పూర్వమీమాంస, న్యాయ, వైశేషిక, సాంఖ్యాలు... ఇలాంటి విభజనను చెప్పకపోగా, ఈ విభజన తప్పు అని ఖండించాయి. ఈ మేరకు అవి (epistomological) జ్ఞాన సంపాదనా తర్కానికి సంబంధించి వాస్తవిక దృష్టిని ప్రదర్శించాయి. అతీంద్రియ శక్తులలో అపార విశ్వాసంగల యోగశాస్త్రంలో మాత్రమే ఈ ద్వంద్వ సత్యభావన ప్రవేశించింది.

బౌద్ధంలో నాగార్జునుడు, వైదికంలో శంకరుడు ఈ ద్వంద్వ సత్యభావం ప్రవేశపెట్టడానికి ఏమైనా కారణమున్నదా? ఉన్నది. ఆ కారణం తాత్త్వికమైనది కాదు మతపరమైనది.

నాగార్జునుని కాలానికి మహాయానం విశ్వరూపం ధరించింది. వజ్రయానచ్ఛాయలు మొదలైనాయి.

బోధిసత్వుడు, పునర్జన్మ, స్వర్గ - నరకాలు, బుద్ధుని అసంఖ్యాకమైన జాతకగాథలు, బుద్ధుని విగ్రహాలు, శరీరావశేషాల చుట్టూ నిర్మితమైన స్థూపాలు, చైత్యాలు... ఇలా ఒక మత వ్యవస్థ రూపొందింది. మూఢాచారాలు, మూఢ విశ్వాసాలు బౌద్ధంలో ప్రవేశించాయి. 'బౌద్ధం' ప్రజామతంగా రూపొందినదనడానికి ఇదంతా తార్కాణం అని బౌద్ధతాత్త్వికులు సరిపెట్టుకోసాగారు. దేవుడు లేదు, ఆత్మ లేదు అని చెప్పిన బౌద్ధం ఇలా రూపాంతరం చెందడంతో నాగార్జునుడు లాంటి తాత్త్వికులకు ఒక పెద్ద వైరుధ్యం కనిపించింది.

''దుఃఖం, దుఃఖ కారణం.
దుఃఖ నివారణ మార్గం.''

అని మొదలైన బౌద్ధం ఎక్కడి నుండి ఎక్కడికి వచ్చింది? ఈ వైరుధ్యానికి పరిష్కారంగానే నాగార్జునుడు ఇదంతా సంవృతిసత్యం అని చెప్పి సమాధానపడి, అసలు సత్యం శూన్యం అని తనకు తాను సంతృప్తి చెందాడు. శంకరాచార్యునికి ఇదే సమస్య ఎదురైంది. నిర్గుణ పరబ్రహ్మోపాసకుడైన శంకరుడు కనపడ్డ చెట్టుకు, పుట్టకు, రాతికి, రప్పకు స్తోత్రాలెలా రాశాడు?

ఈ ఉభయులూ కేవలం తత్త్వవేత్తలు కారు మత ప్రచారకులు. వారి మతానికి, తత్వశాస్త్రానికీ వైరుధ్యముంది. ఒక వైపున సర్వమూఢాచార సమర్థన, మరొక వైపున ఇదంతా సంవృతి లేక వ్యావహారిక సత్యం, పరమార్థం, శూన్యం లేక నిర్గుణపరబ్రహ్మం అని తమ తాత్విక అంతరాత్మకు సమాధానం.

యూరోపియన్ తత్వవేత్తలలో బిషప్ బెర్క్లీకి ఈ సంకటం ఏర్పడ్డది. ఆయన భావవాద తాత్వికుడు మాత్రమే కాక క్రైస్తవ మత ప్రచారకుడు. కనుక ఆయన రెండు సత్యాలను గురించి ప్రస్తావించాడు. మిగతా యూరోపియన్ భావవాద తాత్వికుల కీభావం కలుగలేదు.

మత వ్యవస్థ, తాత్విక చింతనను కలుషితం చేసిన ఉదంతాలకు శూన్యవాద, మాయావాదాలు తార్కాణం. ఉపనిషత్తులలోని భావవాదానికి నాగార్జున, శంకరుల భావవాదానికీ వ్యత్యాసం ఇక్కడే కనిపిస్తుంది.

వైదిక కర్మకాండపట్ల నిరసనతో, పాక్షికత నుండి అఖండత్వానికి, ప్రత్యేకత నుండి సాధారణత్వానికి ప్రయాణం చేసే క్రమంలో ఉపనిషత్ భావవాదం ఏర్పడ్డది. తాత్విక పరిణామక్రమంలో ఇదొక ముందడుగు. ఉపనిషత్తులు చదువుతూ వుంటే ఎన్నో భావాలు, ఊహలు స్పష్టాస్పష్టంగా స్ఫురిస్తాయి. భావవాద పరిధిలో తాత్విక చింతన ఎంతవరకూ ముందుకు సాగే వీలుందో అంతవరకూ ఉపనిషత్తులలో ముందుకు సాగింది.

శూన్యవాదం, మాయావాదాల పరిస్థితి వేరు. హేతువాదం, వాస్తవికతా వాదం అత్యున్నత స్థాయి నందుకొని అనేక కారణాలవల్ల తమ స్థితి నిలుపుకోలేక పతనం చెందిన కాలంలో శూన్యవాదం, మాయావాదం, భావవాదాన్ని పునరుద్ధరించాయి. వీనిలో అస్పష్ట భావావేశం లేదు. తార్కికపదగుంభన మాత్రం ఉంది. హృదయాన్ని స్పందింపచేసే ఒక్క అంశమూ లేదు. మేధస్సును చికాకుపరిచే వాదనలు అనేకం వున్నాయి.

యూరప్‌లోనూ ఇదే పరిస్థితి. ప్లేటో, అరిస్టాటిల్‌ల భావవాదంలో భావావేశం ఉంది. 16, 17 శతాబ్దాల భావవాదంలో మతాభినివేశం చోటు చేసుకొని తర్కప్రాగల్భ్యం మాత్రం మిగిలింది. బానిస సమాజ విచ్ఛిత్తి దశలో ఉద్భవించిన భావవాదం మొదటిది. భూస్వామ్య సమాజశృంఖలాలు బిగుస్తున్న కాలంలో తలఎత్తిన భావవాదం రెండవది.

శూన్యవాదం బౌద్ధంలో ప్రవేశపెట్టిన మార్పును ప్రముఖ రష్యన్ తత్త్వవేత్త షర్‌బట్‌స్కీ ఇలా వివరించారు.

"An atheistic soul denying philosophy, teaching a path of personal deliverance in an absolute extinction of life, is superseded by a religion highly devotional ceremonial and claiming salvation not in annihilation but eternal life. History of religion scarcely witnessed such a brake between the New and the Old within

the pale of what nevertheless continues to claim descent from the same religious founder."

(BUDHIST LOGIC)

"దేవుని, ఆత్మను నిరాకరించి సంపూర్ణ ఆత్మ వినాశనంలో వ్యక్తిమోక్షాన్ని దర్శించిన తత్వశాస్త్రం స్థానంలో మహాజటిలమైన కర్మకాండతో కూడిన మతం చోటు చేసుకొంది. ఆత్మ వినాశనంలో కాక, ఆత్మ శాశ్వతత్వంలో మోక్షాన్ని ఊహించింది. ఒకే మత బోధకుని పేరుతో చలామణి అవుతూ పాత కొత్తల మధ్య ఇంతటి వ్యత్యాసం కలిగిన రెండు శాఖలు ఏర్పడడం ప్రపంచ మత చరిత్రలోనే అపూర్వం." (బౌద్ధతర్కం).

బుద్ధుని దృష్టిలో నిర్వాణం అనే భావం ఆత్మవినాశకం; నేను అనే అహంత భస్మీపటలమై కార్యకారణ సంబంధమనే మహాప్రవాహంలో లీనం కావడం. ఆ పిమ్మట మిగిలేది ఏమీ లేదు. శూన్యం మాత్రమే. చార్వాకులు ఇదే అన్నారు.

నాగార్జునాచార్యులు శూన్యం అనే మాటను ఆదిబౌద్ధం నుండి స్వీకరించారు. దానికి కొత్త అర్థమిచ్చి సత్యద్వయ భావనకు రూపకల్పన చేశాడు.

ఏదీ మిగలకపోతే నిరంతరాయత అవిచ్ఛిన్నత ఎక్కడ? ఇందుకు చార్వాకులు సమాధానం చెప్పలేదు. బుద్ధుడు చెప్పాడు. వ్యక్తి నశిస్తాడు. సమష్టి కొనసాగుతుంది. అహంత నశిస్తుంది. తథత కొనసాగుతుంది. ఇది చాలా ఆధునికమైన సామాజిక దృష్టి; శాస్త్రీయమైనది కూడా. సర్వవైనాశిక నిర్వాణభావం, మహాయానకాలం నాటికి శాశ్వతత్వ నిర్వాణభావంగా రూపొందడం బౌద్ధంలోని రూపాంతరానికి తార్కాణం.

జ్ఞాన సంపాదనా తర్కంలో ఆచరణకు ప్రాధాన్యమిచ్చిన వారు ఒక్క నైయాయికులు మాత్రమే.

ఆచరణ జ్ఞానానికి గీటురాయి. ఒక మనిషి ఒక చోటినుండి మరొక చోటుకి నడుస్తున్నాడు. కళ్ళతో మనము చూస్తున్నాము. ఇది వాస్తవం. నడక లేదు. నడుచువాడు లేదు - అనే నాగార్జునుని తర్కం వాస్తవికతను నిరాకరించి ఊహాప్రపంచంలో తేలిఆడటం. తర్కం మాటలగారడీ కారాదు. ఎప్పటికప్పుడు వాస్తవికతతో పోల్చుకొని నిలదొక్కుకోవాలి. 'సహోపలంబ నియమం'' అని నైయాయికులు చెప్పినది ఇదే.

అప్పుడప్పుడు మన ఇంద్రియాలు మోసపుచ్చుతాయి కదా! అవును... అదే భ్రాంతి. భ్రాంతిని తొలగించుకోవడానికి ఆచరణ గీటురాయి. మృగతృష్ణను చూచి జలాశయం అనుకుంటాము. కనుక ఇంద్రియజ్ఞానం నమ్మతగింది కాదు, అని శంకరుని వాదన. నీరున్నదీ లేనిదీ పరిక్షించేందుకు రసనేంద్రియం ఉన్నది కదా అని నైయాయికుల సమాధానం. ఇంద్రియజ్ఞానం తార్కిక జ్ఞానంగా రూపొందడానికి ఆచరణ, ఆలోచన వారధి. ఆ వారధిపై ముందుకు సాగవలెనని నైయాయికులు అంటారు. కాని, వెనక్కు పోతానని శంకరులు అంటారు.

నాగార్జునుడు అంతదూరం వెళ్ళలేదు కాని, ప్రతీత్య సముత్పాదానికి శూన్యం అనే పర్యాయపదం చేర్చడం ద్వారా ఈ మేధోతిరోగమనానికి ప్రాతిపదిక వేశాడు.

ఇంత చెప్పినా మాధ్యమిక వాద బౌద్ధం, వైదిక అద్వైతం కంటే మెరుగే. ఆ మెరుగు తాత్వికరంగంలో కాదు సామాజిక రంగంలో.

అవసాన దశలో సైతం బౌద్ధం వర్ణవ్యవస్థను సమర్థించలేదు. అందుకు వ్యతిరేకంగా పోరాటం జరపకపోవచ్చు. మహాయాన, వజ్రయాన దశలలో సైతం సాంఘిక సమతాభావానికే కట్టుబడివుంది. జైనం వర్ణవ్యవస్థతో రాజీపడ్డది. జైన బ్రాహ్మణులు చాలామంది వున్నారు ఆరాధ్యశైవులవలే... కాని బౌద్ధ బ్రాహ్మణులెవరూ లేరు.

యజ్ఞశ్రీ శాతకర్ణికి నాగార్జునాచార్యులు వ్రాసిన సుహృల్లేఖ లౌకిక రాజ్యాంగ వ్యవస్థకు పునాది. నిరంకుశ రాచరిక వ్యవస్థకు అవసరమైన రాజనీతిని బోధించింది - కౌటిల్యుని అర్థశాస్త్రం. రాజు అందరినీ అనుమానిస్తూ ఒకరిమీద ఒకరిని రెచ్చగొడుతూ మాత్రమే బ్రతకగలడు - అని కౌటిల్యుని సిద్ధాంతం. అలా కాదు ప్రజలందరిని జాతి, మత, కుల వివక్షతలకు అతీతమైన సమదృష్టితో చూడడమే రాజ్యాంగ భద్రతకు దృఢమైన పునాది యని సుహృల్లేఖ బోధిస్తున్నది. శాతవాహనరాజులు ఉదార పరిపాలకులు. నాగార్జునాచార్యుని బోధనలను పూర్తిగా కాకపోయినా కొంతవరకు పాటించినవారు.

నాగార్జునుడు స్థాపించిన విశ్వవిద్యాలయంలో దేశదేశాల విద్యార్థినీ విద్యార్థులకు ఎట్టి వివక్షత లేకుండా ప్రవేశం కల్పించడంలోనే అతని విశ్వమానవ సమతాదృష్టి కనిపిస్తున్నది. వైదిక విద్యా కేంద్రాలలో ''నీ జాతి ఏమి?'' అనేది మొదటి ప్రశ్న. బౌద్ధంలో ఆ ప్రశ్నే లేదు.

ఉరిశిక్షను రద్దుచేయాలని నాగార్జునుడు చేసిన సూచన అతని మానవతకు చిహ్నం.

వేద ప్రామాణ్యం అంగీకరించని వారంతా నాస్తికులనే దూషణకు గురైనారు. నాగార్జునుడు అందుకు మినహాయింపు కాడు. ఈ దూషణకు సమాధానంగా నాగార్జునుడు ఈ క్రింది నిర్వచనం ఇచ్చాడు.

''కర్మకు ఫలితమున్నది అనువాడు ఆస్తికుడు. లేదనువాడు నాస్తికుడు.''

కార్యకారణ సూత్ర ప్రాశస్త్యాన్ని పై సమాధానం ద్వారా నాగార్జునుడు నిరూపించాడు. మాయావాదులే నిజమైన నాస్తికులు అన్నాడు. మంచిదే. అయితే అందుకు సన్నిహితంగా వుండే శూన్యవాదాన్ని తానే ప్రతిపాదించాడు కదా! బహుశా శూన్యవాద భావం ఆయనలో అప్పటికి పరిపక్వం కాలేదేమో! లేక వాదన కొరకు పై మాట అన్నారేమో!

నాగార్జునుని రచనల నన్నిటినీ వరుస క్రమంలో అధ్యయనం చేస్తేనే ఈ సమస్యకు సమాధానం వస్తుంది. అది ఇప్పట్లో జరిగే పని కాదు.

కీ.శే. జి.వి. కృష్ణారావుగారు తను గ్రంథం 'విగ్రహ వ్యావర్తిని' ద్వారా ఈ సర్వ విషయాలను తెలుగువారికి అందించారు. మూలాన్ని అనువదించడమే కాక 130 పేజీల ప్రస్తావన వ్రాశారు. అది ఒక ప్రత్యేక గ్రంథం. ఈ ప్రస్తావన లేకపోతే మూలానువాదం అర్థం కాదు. నాగార్జునాచార్యుని బోధనలను ఇంతగా ప్రచారంలో పెట్టిన కృష్ణారావుగారు తెలుగు సాహిత్యానికే కాక తాత్విక చింతనకే ఎంతో సేవచేశారు. వారి యితర సాహిత్య కృషి అంతా ఒక ఎత్తు... ఈ ఒక్క గ్రంథం ఒక ఎత్తు.

# చిత్రస్రష్ట

# రాజా రవివర్మ

డా. సంజీవ్‌దేవ్

ఏకత్వం అనేది చాలా గొప్పది. అది లేంది ప్రపంచం విచ్ఛిన్నమై పోతుంది. జాతి విచ్ఛిన్నమై పోతుంది. ఇంకా విచ్ఛిన్నమై పోతాయి సమాజం, వ్యక్తీ కూడా.

కాని ఏకత్వానికున్నంత గొప్పతనం కాకపోయినా కొంత తక్కువ గొప్పతనమైనా భిన్నత్వానికి కూడా ఉన్నది. భిన్నత్వం లేంది సృష్టిలోని వైవిధ్యం మసకబారుతుంది, వైచిత్ర్యం వెలవెల పోతుంది. వైయక్తిక ఆకర్షణ నిస్తేజమవుతుంది. సాంస్కృతిక రంగాల్లోని సృజనాత్మక సౌరభం మందగించి పోతుంది.

అందుకే ఒక దేశ సంస్కృతికీ మరో దేశపు దానికీ భిన్నత్వం ఉంటూ వస్తుంది, మానవజాతి వికాసపు ప్రభాతం నుంచీ కూడ.

కనుకనే ప్రపంచంలో సాహితీ భేదాలు, సంగీత భేదాలు, రూపకళా భేదాలు, ఆలోచనా వైభిన్యాలు మొదలైనవి మానవ జీవితానికి వరదానాలైనాయి. ఈ సత్యమే చిత్రకళా రంగానికి కూడ వర్తిస్తుంది. అందుకనే పాశ్చాత్య చిత్ర రచన, ప్రాచ్య చిత్రరచన, దూరప్రాచ్య చిత్ర రచన, ఇంకా ఇతర చిత్రరచనలనీ ఏర్పడినాయి.

రాజా రవివర్మ భారతీయుడైనప్పటికీ ఆయన పాశ్చాత్యచిత్రకారుడు అనే వాస్తవాన్ని తెలిపితే చాలామంది తబ్బిబ్బవుతారు. విశేషమేమంటే రవివర్మ చిత్రించిన చిత్రాలన్నీ భారతీయ విషయాలకు సంబంధించినవే. ఆయన రచించిన చిత్రాలలో భారతీయ దేవదేవతలే ఎక్కువ ఉన్నారు. అయినప్పటికీ రవివర్మ చిత్రరచనను పాశ్చాత్యమే అన్నారు. ఇందుకు కొంత వివరణ అవసరం.

సాహిత్యంలో కాని, చిత్రరచనలో కాని మరో కళలో కాని వస్తువూ, రూపమూ అనేవి రెండు ప్రధానాలు. వస్తువు అనే దాన్ని విషయమనీ, విషయ వస్తువని కూడా అంటారు. ఉదాహరణకు సరోజినీనాయుడు భారతీయ విషయాలను అభివ్యక్తపరుస్తూ ఎన్నో కవితలు రచించింది. అయితే ఆ కవితలన్నీ ఇంగ్లీషు భాషలో రచించబడినాయి. అదేవిధంగా పాశ్చాత్య విషయాలమీద, క్రైస్తవ మతం మీద, షేక్స్‌పియర్ మీద, ప్లేటో మొదలైన వారి మీద తెలుగులో కొన్ని రచనలు చేయబడినాయి. విచిత్ర మేమంటే సరోజిని రచించినవి ఇంగ్లీషు సాహిత్యం క్రింద కొస్తాయి. తెలుగులోవి తెలుగు సాహిత్యం అనిపించుకొంటాయి. తెలుగులో బైబిల్‌ను గురించి రచించినా, ఇంగ్లీషులో ఉపనిషత్తులను గురించి రచించినా, మొదటిది తెలుగు సాహిత్యం అవుతుంది. రెండవది ఇంగ్లీషు సాహిత్యం అవుతుంది.

రచనలో ఏ దేశపు విషయం ఉన్నప్పటికీ అది ఏ మాధ్యమంలో వ్రాయబడిందో ఆ మాధ్యమానికి చెందిన పేరుకు చెందిన రచన అనే అంటారు. విషయాంది కాదు ప్రాధాన్యం; విషయాన్ని అభివ్యక్తపరచిన మాధ్యమానిదే ప్రాధాన్యం.

కనుకనే రాజా రవివర్మ తన చిత్రరచనలో భారతీయ విషయాలను చిత్రించినా, చిత్రించబడిన మాధ్యమం పాశ్చాత్యం కనుక రవివర్మ కళ పాశ్చాత్యం క్రిందకే వస్తుంది. ఇందుకు వ్యతిరేకంగా అవనీంద్రనాథ టాగూరు లాంటి కొందరు భారతీయ చిత్రకారులు మెడోనా, క్రీస్తు జననం లాంటి చిత్రాలను భారతీయ మాధ్యమంలో రచించారు. అటువంటి చిత్రాలు పాశ్చాత్య విషయవస్తువుకు చెందినా కూడ అవి భారతీయ చిత్రరచన క్రిందకే వచ్చాయి.

రాజా రవివర్మ ఏ మాధ్యమంలో రచించాడు అనేది ప్రధానం కాదు, ఆయన రచించినవి రచనా నైపుణిని ఎంతవరకు కలిగి ఉన్నాయి అనేది ప్రధానం. ఆయన గొప్ప రచనా కౌశల్యం గలవాడు, ఎన్నో ఉత్తమ కళాఖండాలను రచించాడు. ఆయన భారతీయ ఇతివృత్తాన్ని పాశ్చాత్య మాధ్యమంలో రూపొందించిన ఆచార్య చిత్రస్రష్ట.

బ్రిటిష్ పరిపాలనా కాలంలో భారతీయ సాంప్రదాయ చిత్రకళకు గ్రహణం పట్టి పాశ్చాత్య చిత్రకళ దేశంలో వ్యాప్తి చెందింది. భారతదేశంలోని చిత్రకళా విద్యాలయాల్లో విద్యార్థులకు పాశ్చాత్య చిత్రకళనే నేర్పుతుండడం జరిగింది. కాని భారతదేశంలో క్రిందటి శతాబ్దపు అంతిమ భాగంలో విదేశీ ప్రభుత్వం మీద అయిష్టం జనించింది. అదే అయిష్టం విదేశీ సంస్కృతి మీద కూడా జనించటంతో ఆ స్వదేశీ ప్రీతి భారతీయ చిత్రరచన మీదకు కూడా దొర్లింది. దాని ఫలితమే ఆనాడు భారతీయ చిత్ర పునర్జాగృతికి ప్రాతిపదిక కావటంతో అవనీంద్రనాథ టాగూరు, ఇ:బి. హావెల్, గగనేంద్రనాథ టాగూరు, పరోక్షంగా రవీంద్రనాథటాగూరు మొదలైన వారి ప్రయత్నంతో తిరిగి భారతీయ చిత్రకళ నిద్రనుంచి మేల్కొనటం జరిగింది. వారి తరువాత నందలాల్ బోసు, అసిత కుమార్ హాల్దార్ ఆ నవభారత చిత్రకళను వ్యాప్తిలోకి తేవటం జరిగింది.

రాజా రవివర్మకు ఈ స్వదేశీ ఉద్యమంతో సంబంధం లేదు. ఆయన దక్షిణ భారతీయుడు. స్వదేశీ ఉద్యమం ఆనాటికి ఉత్తరభారతీయం. ఆ ఉద్యమంకంటే చాలా ముందు జన్మించాడు రాజా రవివర్మ. ఆయన 1848లో కేరళలో త్రివేంద్రంకు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న కిలిమనూర్ అనే గ్రామంలో జన్మించాడు. తిరువాన్‌కూరు రాజవంశానికి సమీప బంధువు రవివర్మ. ఆయన వంశంలోని వారంతా సాహిత్యంలో, చిత్రరచన మొదలైన వాటిలో ప్రవేశం ఉన్నవారు. ఆయన సోదరి మంగళాబాయి, సోదరుడు రాజా రాజవర్మ కూడ నిపుణ చిత్రస్రష్టలు.

రవివర్మను కళారంగంలో ప్రథమంగా, ప్రధానంగా ప్రోత్సహించిన వ్యక్తుల్లో ఆయన పెదతండ్రి రాజా రాజవర్మ ముఖ్యుడు. రవివర్మకు చిత్రరచనలో ప్రాథమిక శిక్షణ నిచ్చింది కూడా ఆయనే; ఆయనకు ఆనాడు నూతనంగా వాడుకలోకి వచ్చిన తైలచిత్రణ విధానాన్ని నేర్పింది ఒక తెలుగు వ్యక్తి అలగిరినాయుడు; ఆయన తిరువాన్‌కూర్ దర్బార్ కళాకారుడుగా ఉండేవాడు.

రాజా రవివర్మ భారతీయ సాహిత్యంతో బాగా పరిచయం ఉన్నవాడు. ప్రత్యేకించి ప్రాచీన మళయాళ సాహిత్యం ఆయనకు అభిమానమైంది. ప్రాచీన భారతీయ సాహిత్యంతో ఉన్న ఆయన పరిచయమే ఆయన చిత్రరచనలో ఎక్కువగా పౌరాణిక మూర్తులుగా ప్రతిబింబిం

చింది. రవివర్మ తల్లి కూడ మళయాళ కవయిత్రి. రవివర్మకు సాహిత్యంలో అభిరుచి మాత్రమే కాక కేరళలోని ప్రధాన నృత్యకళగా రూపొంది ఉన్న కథాకళిమీద, బొంబాయిలో ఆనాడు వ్యాప్తిలో ఉన్న పార్సీ, మరాఠీ రంగస్థల కళమీద కూడ కొంత మక్కువ ఉండేది.

ఆయన జీవితంలోని ఈ పృష్ఠభూమిని గమనిస్తే మనకు విశదమవుతుంది ఆయన ఎందుకు తన చిత్రాల్లో పౌరాణిక వాతావరణాన్ని సృష్టించాడు అనేది. ఆయన చిత్రాల్లోని రామాయణ పాత్రలు, శకుంతలా, దమయంతి మొదలైన పాత్రలు రంగస్థలం మీది పాత్రలుగా గోచరిస్తాయి.

రవివర్మ చిత్రాలను గురించి తెలపటానికి ముందు అసలు భారతీయ చిత్రకళకూ, పాశ్చాత్య చిత్రకళకూ ఉన్న తారతమ్యం ఏమిటో తెలియచెప్పటం మంచిది. ఈ తారతమ్యం ప్రధానంగా సాంకేతికమైంది.

భారతీయ చిత్రరచన ప్రధానంగా నీటిరంగులతో రచించబడుతుంది; పాశ్చాత్య చిత్రరచన తైలవర్ణాలతో. అజంతా, బాఘ్, సిత్తన్నవాసల్, లేపాక్షి మొదలైన చోట్లలోని కుడ్య చిత్రాలన్నీ కూడ నీటిరంగుల్లో రచించబడినవే. మొగల్, రాజపుత్ర చిత్రాలన్నీ కూడ నీటి రంగుల్లో వేయబడినవే. పాశ్చాత్య చిత్రాలు ప్రధానంగా తైలవర్ణాల్లో రచించబడినాయి. నీటిరంగుల చిత్రాలు సున్నితంగా, కాంతివంతంగా, కవిత్వమయంగా గోచరిస్తాయి. స్త్రీ సౌకుమార్యం నీటిరంగుల్లో గోచరిస్తుంది. అందులో చిత్రితమైన విషయం గాంభీర్యం కలది అయినప్పటికీ అది ఆభాస లాలిత్యం కలదిగా గోచరిస్తుంది. తైలవర్ణ చిత్రాలవలె కాక నీటిరంగులు త్వరలో ఎండిపోతాయి.

ఇక పాశ్చాత్య చిత్రణలో వాడుకలో ఉన్న తైలవర్ణ చిత్రాలు స్థూలంగా గోచరిస్తాయి. పురుష గంభీరంగా కనిపిస్తాయి, రంగుల కాంతి కొంత మందంగా కనిపిస్తుంది; త్వరగా ఎండక చాలా రోజులు తడిగానే ఉంటాయి. సౌక్ష్యానికంటే స్థౌల్యానికే అవి ఎక్కువ కట్టుబడి ఉంటాయి. వీటిలో అవసరమైన దిద్దుబాట్లు చేసుకోటానికి అవకాశాలు ఎక్కువ ఉంటాయి. వీటిని ఏ భూమిక మీదయినా చిత్రించవచ్చును. దుమ్ము అతికి ఉంటే తడి గుడ్డతో తుడవవచ్చు.

ఇక చిత్రణ పద్ధతిని గురించి. భారతీయ చిత్రకళలో రూపచిత్రణకు రేఖ ప్రధానం. పాశ్చాత్య చిత్రణకు రంగు ప్రధానం. చిత్రరచన చేయబడే భూమిక వెడల్పు, పొడవు కలిగిన రెండు ఆయతనాల్లోనే ఉంటుంది. కాని దానికి మూడో ఆయతనమైన లోతు ఉండదు. పాశ్చాత్య చిత్రకారులు ఆ రెండు ఆయతనాల సమతల భూమిక మీద అవయవాల గుండ్రదనాన్ని చూపే మూడు ఆయతనాల చిత్రణను చేస్తారు. వారి చిత్రణలో రేఖ ఉండదు. భారతీయ చిత్రరచనలో పాశ్చాత్య చిత్రరచనలో వలె వెలుగు నీడలతో అవయవాల గుండ్రతనపు ఆభాసను చిత్రించక రేఖలతో రెండు ఆయతనాల సమతల రూపాన్ని మాత్రమే సృష్టిస్తారు. ఆ రేఖల మధ్య రంగులను వేస్తారు. ఈ విధంగా ఈ రెండు చిత్ర విధానాల మధ్య ఇంకెన్నో సాంకేతిక ప్రభేదాలున్నాయి.

పర్యవసానం ఏమంటే పాశ్చాత్య చిత్రరచనలో ఉన్నదున్నట్లు కనిపించే వాస్తవ వాదం ఎక్కువుంటే భారతీయ చిత్రకళలో ఆదర్శవాదం, కల్పనావాదం ఎక్కువ ఉంటుందని. వస్తువు వస్తువుగాకాక వస్తువు యొక్క చిత్రంగా గోచరించాలని, స్థలం స్థలంగా కాక స్థలం యొక్క చిత్రంగాను, మనిషి మనిషి చిత్రంగాను కనుపించాలని భారతీయ చిత్రకారుల ఆశయం. పాశ్చాత్య చిత్రకారుల దృష్టిలో మాత్రం దృశ్య జగత్తంతా మార్పు లేకుండా ఉన్నదున్నట్లు చిత్రంలో గోచరించాలని.

రాజా రవివర్మ చిత్రణంతా ఈ వాస్తవ వాదంపై ఆధారపడే ఉంటుంది. చిత్రంలోని వస్తువు కూడ భౌతిక జగత్తులో గోచరించే వాస్తవ వస్తువు వలెనే గోచరించాలని. చిత్రం చిత్రంగా మాత్రమే గోచరించాలని భారతీయ చిత్రకారుల ఆదర్శమూ ఆచరణా అయితే చిత్రం వస్తువుగానే గోచరించటం పాశ్చాత్య చిత్రకారుడైన రాజా రవివర్మ ఆశయం.

రవివర్మ తన 14వ ఏటనుంచి ట్రివేండ్రంలో నివసించసాగాడు. అక్కడుండగా ఒక డచ్ రూపపట చిత్రకారుడైన (Portrait painter) థియోడర్ జెన్‌సెన్ అనే ఆయన చిత్ర రచన చేస్తుండటం చూచాడు రవివర్మ. ఆ డచ్ చిత్రకారుని టెక్నిక్‌ను నేర్చుకుంటే బాగుంటుంద నుకున్నాడు రవివర్మ. కాని ఆ చిత్రకారుడు చిత్రించే విధానాన్ని చూస్తూ ఉండటంతో సరిపెట్టుకున్నాడు ఆయన. ఇదంతా కూడ రవివర్మకు సాయపడింది తన నూతన పంథాను మలచుకోటంలో.

అయితే ఒకటి మాత్రం మరచిపోరాదు. తరువాత తరువాత ఆయన అనుసరించిన రీతి బొత్తిగా శుద్ధ పాశ్చాత్య రీతికాక దానితో కొంత తంజావూరు ప్రాచీన చిత్రరీతి కూడా మిళితమై కనిపిస్తుంది. ఈ చిత్రణ శైలి స్వయంగా రవివర్మ సృష్టించినదే. ఈ వినూత్న మిశ్రమ శైలిని విక్టోరియన్ ఇండియన్ స్టైల్ అన్నారు. ఈ నూతన శైలిలోనే ఆయన చిత్రించిన పౌరాణిక చిత్రాలెక్కువగా ఉన్నాయి. ఆయన ఈ చిత్రశైలిలో దేవరూపాలను కూడ మానవరూపాలలో చిత్రించేవాడు.

1872లో మద్రాసులో జరిగిన ప్రదర్శనలో పాల్గొనమని అప్పటి తిరువాన్‌కూర్ పాలకుడైన అయిల్యాం తిరుణాల్ ప్రోత్సహించగా ఆ ప్రదర్శనలో ఆయనకు గవర్నర్ సువర్ణపతకం బహూకరించబడింది. అపుడు ఆయన వయస్సు 25 సంవత్సరాలు. తరువాత అదే చిత్రం వియన్నాలో జరిగిన అంతర్జాతీయ చిత్రప్రదర్శనానికి పంపగా అక్కడ కూడ బహుమతినందింది. తరువాత కొంత కాలానికి తాను చిత్రించిన 'శకుంతల దుష్యంతునకు వ్రాస్తున్న ప్రేమలేఖ' అనే చిత్రానికి కూడ పతకం లభించింది. ఈ చిత్రం సర్ మోనియర్ విలియమ్స్ ఇంగ్లీషు అనువాదమైన కాళిదాస విరిచిత అభిజ్ఞాన శాకుంతలంకు ముందుచిత్రంగా వెలువడింది. 1893లో ఆయన రచించిన ఒక పది స్త్రీ చిత్రాలను చికాగోలో జరిగిన ఒక అంతర్జాతీయ ప్రదర్శనానికి పంపగా ఆ చిత్రాలన్నిటినీ వారు ప్రదర్శించి రెండు విలువగల బహుమతులను ఆయన కందజేశారు. ఈ విధంగా ఆయన ఎన్నో జాతీయ, అంతర్జాతీయ బహుమతులను అందుకొని ఆనాటి చిత్రకళా జగత్తులో ఖ్యాతినార్జించాడు.

రవివర్మ ఖ్యాతి పెరిగిన కొద్దీ ఆయన చిత్రాలను సేకరించాలనే ఆరాటం ఎక్కువైంది దేశంలో. అందువల్ల తన చాలా మౌలిక చిత్రాలకు కాపీలు తీయించే విధానం Oliography ద్వారా జరిగిపోసాగింది. అందువల్ల ఆయన చిత్రాలు సామాన్యులకు కూడ అందుబాటులోకి రావటం జరిగింది. నేడు మనం అనేక ఇళ్లలో పౌరాణిక సంబంధమైన రవివర్మ చిత్రాలు చూస్తున్నాం. అవన్నీ కూడా అటువంటి కాపీలే.

రవివర్మ తన చిత్రరచనలో ఎక్కువగా ఉష్ణ వర్ణాలనే వాడతాడు; అంటే ఎరుపు, నారింజ, పసుపు, గోధుమ రంగు మొదలైన వాటిని ఎక్కువ వాడతాడు. శీతల వర్ణాలైన నీలం, ఆకుపచ్చ, బూడిద రంగు మొదలైన వాటిని చాలా అరుదుగా మాత్రమే వాడతాడు ఆయన. పౌరాణికాలు కాని తన చిత్రాల్లో ఎక్కువగా స్త్రీ మూర్తులే దర్శనమిస్తాయి. స్త్రీల మారుతున్న మూడ్సును, లలితహావభావాలను, అంగభంగిమలను చిత్రించటంలో ఆయన సిద్ధహస్తుడు.

భారతీయ చిత్రకారులు, చిత్రకళా సమీక్షకులు చాలామంది రాజా రవివర్మను, ఆయన చిత్రరచనను వ్యతిరేకంగా విమర్శించారు. అయినా, అంతగా పేరొందిన భారతీయ చిత్రకారుడు ఆయన ఒక్కడేమో. భారతీయుడై యుండి పాశ్చాత్య రీతిలో చిత్రరచన చేయటం తప్పా? ఇంగ్లీషులో రచనలు చేసిన భారతీయ ప్రఖ్యాత రచయితలంతా తప్పుచేసిన వారేనా? భారతీయులై పుట్టి విదేశీ కార్లను, విదేశీ విమానాలను ఉపయోగించుకొనే వారంతా తప్పు చేసేవారేనా?

చిత్రసృష్టిలో సిద్ధహస్తుడైన యశస్వి రాజా రవివర్మ తాను పుట్టిన కిలిమనూరు గ్రామంలోనే 1906లో శాశ్వతంగా కన్ను మూసాడు. కాని ఆయన చిత్రించిన కళాఖండాలు నేటికీ కన్నుమూయక మేల్కొనే ఉన్నాయి.

**Darwin used to go into the Zoological Gardens in London, and standing by the glass case containing the cobra di capello, put his forehead against the glass while the cobra struck out at him. The glass was between them; Darwin's mind was perfectly convinced as to the inability of the snake to harm him: yet he would always dodge. Time after time he tried it, his will and reason keeping him there, his instinct making him dodge. The instinct was stronger than both will and reason.**

**Liberator and leader, the dying Lenin wrote in his last active year: "The machine refused to obey the hand that guided it. It was like an automobile that is going, not in the direction of the man who is driving it, but in the direction desired by someone else, as if it were being driven by some secret, illegal hand. God knows whose.... Be that as it may, the car is not going in the direction the man at the wheel imagines."**

# సర్వే సర్వత్రా విలువల విధ్వంసం

## దోపిడీ సంస్కృతిలో విలువల రాహిత్యం

రవీంద్రనాథ్
ఆలపాటి

మన దేశంలో వృత్తులు ఉద్యోగాలు సంస్థలు అన్నీ ఇటీవల చాలా భ్రష్టుపట్టిపోయాయి. అలా దిగజారిపోయిన వాటిల్లో పౌర సేవావిభాగం ఒకటి (సివిల్ సర్వీసు). సివిల్ సర్వీసు ఒకటే కాదు యింకా ఎంతో గౌరవప్రదంగా భావించే న్యాయశాఖపై కూడా రకరకాల విమర్శలు బాహాటంగా వినవస్తున్నాయి నేడు.

అయితే చాలా భ్రష్టుపట్టిపోయిన విభాగం ఏదంటే రాజకీయాలు. ఒకప్పుడు మహాత్మా గాంధీ; జవహర్‌లాల్ నెహ్రూ వంటి హేమాహేమీలును, లెక్కకు మించి సర్వస్వం కోల్పోయిన త్యాగధనులను, దేశంకోసం తృణప్రాయంగా ప్రాణాల అర్పించిన వీరులను, వారంతా జైళ్ళల్లో యమయాతనలుపడి పోలీసుల పైశాచిక దమనకాండకు లోనై కూడా దేశం నుంచి ఏమీ ఆశించని వారిని, అటువంటి వారితో కూడిన రాజకీయరంగం నేడు స్వార్థపరులతో నిండి, నేరస్థులతో కలుషితమైపోయింది. చిన్న వ్యాపారస్థుల నుండి పెద్ద వ్యాపారస్థుల దాకా వ్యాపారరంగం నల్లబజారుల్లో దొంగ వ్యాపారం, స్మగ్లింగ్ (రహస్యంగా బంగారంవంటి వస్తువుల క్రయ విక్రయాలు) పన్నుల ఎగవేత వీటితో లుకలుక లాడుతున్నది. పన్నులు ఎగవేతలో వ్యాపారస్థులే కాదు, అన్ని వర్గాలవారూ వున్నారు. ఈ ముదనష్టాలేవీ వర్తించకుండా చెక్కుచెదరకుండా వున్నది మన సైనిక వ్యవస్థ మాత్రమే.

ఇలా ఎందుకు జరిగింది అని ఆలోచిస్తే బ్రిగేడియర్ గ్రాంట్ తమ వ్యాసంలో (ది సివిల్ సర్వీస్) రెండు కారణాలు చెప్పారు. అందులో మొదటిది శ్రీమతి ఇందిరాగాంధీ ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ప్రభుత్వానికే కాక ప్రభుత్వాన్ని నడిపే నాయకుని లాంటి వ్యక్తికి కూడా నిబద్ధుడై వుండాలి అనేది. ఇది ఐ.ఏ.ఎస్. అధికారులను పూర్తిగా చేతులెత్తేసేలా నిర్వీర్యులను చేసింది. పూర్వం ఐ.సి.ఎస్. అధికారులు అలాకాదు. ప్రపంచంలో అత్యుత్తమమైన సర్వీసుకు చెందిన వారు ఐ.సి.యస్. పాలకులు మంత్రిగారి ముఖంలోకి తిన్నగా చూసి మరీ కాదని చెప్పే ధైర్యం వారికి వుండేది. (నోమిని స్టర్ అని) రెండవ కారణం మనదేశంలో రాజకీయ చైతన్యం పునర్వికాసం ఏర్పడినాక దేశవ్యాప్తంగా పారిశ్రామిక వికాసం ఏర్పడింది. ఇందువల్ల ఆదినుంచీ రాజకీయ ఆదర్శాలు, అభిప్రాయాలు ఉద్యోగాల నియామకం పదవుల పంపకం వాటి విషయంలో అధిక ప్రాధాన్యం సంతరించుకుని, వృత్తిలో కేవలం పరిపాలనా సామర్థ్యం 'అనే అంశాలు' బొత్తిగా నిర్లక్ష్యం చేయబడ్డాయి.

మనదేశంలో పారిశ్రామిక అభ్యున్నతి కంటే ముందుగా రాజకీయ చైతన్యం రావడంవల్ల విలువలతో సంబంధం లేకుండా పదవుల కోసం, ఉద్యోగాల కోసం ఎగబడటం సాధారణమయింది. బ్రిగేడియర్ గ్రాంట్ చెప్పినట్లు పారిశ్రామిక అభ్యుదయం జరగకుండా పదవులకు ఎట్లా ఎగబ్రాక గలరో స్పష్టం కాదు. అసలవి ఎలా వస్తాయి?

---

నిజానికి వృత్తిలో ప్రావీణ్యానికి పరిపాలనా సామర్థ్యానికి ఆదర్శాలకు పడకపోవడం అనేది లేదు. ఏ ఆదర్శాల అభివృద్ధికి అయినా ప్రతిభా సామర్థ్యాలు అవసరమే కదా! మాటవరసకు ప్రజాస్వామ్యం మన ఆదర్శమయితే, పరిపాలనా సామర్థ్యాన్ని తక్కువ చేసి చూస్తే అది ఎలా ముందుకు వెళ్తుంది? ఒకవేళ సీనియర్ అధికారుల్ని ఉద్యోగుల్ని బదిలీ చేస్తారనుకోండి. ఎలక్షన్ సమయంలో ప్రభుత్వానికి ఓట్లు సంపాదించడానికి సహాయం కోసం, అటువంటి చేష్టలు ప్రజాస్వామ్యాన్ని పరిపాలనను క్రుంగదీస్తాయి.

పై పెచ్చు ప్రభుత్వానికి లేక ప్రభుత్వాన్ని నడిపే వ్యక్తికి విధేయులై వుండాలని శాసించడం వలన, యిటువంటి తప్పుడు విధానంవలన ఉద్యోగుల నైతికబలం దెబ్బతిన్నది. రాజ్యాంగ బద్ధులై అధికారులు పనిచేయాలి. అట్లాగాక పదవిలోవున్న వారిపట్ల విధేయత నిబద్ధతలతో పనిచేయవలసి వస్తే ఉద్యోగులు తప్పుదారిలోపడి భ్రష్టాజులవుతారు. పొగిడి అబద్ధాలు చెప్పి పబ్బంగడుపుకునే ------ జీవులవుతారు.

ఐ.సి.ఎస్. అధికారులను గొప్పచేసి ఐ.ఏ.ఎస్. అధికారులకు తక్కువ చేసి చెప్పడం కాదు. ప్రపంచంలో కెల్లఐ.సి.ఎస్. అధికారులు ఉత్తమమైన పాలకులు అనే మాట ఒప్పుకోవడానికి సందేహం కలుగుతుంది. అలానే ఐ.ఏ.ఎస్. వారు వెన్నెముక లేని వారనీ అనలేము. వలసవాదులైన బ్రిటీష్ సామ్రాజ్యవాదుల అధికారాన్ని నయానా భయానా ఎత్తిచూపడమే ఐ.సి.ఎస్. అధికారుల పరమలక్ష్యం. ఆ రోజుల్లో ఆ పనే వారు చేశారు.

ఐ.సి.ఎస్. అధికారుల శిక్షణ అందుకు అనుకూలంగా జరిగింది. పాలితుల కంటే అధికులనే భావం ప్రదర్శించాలి. వారి శిక్షణలోనే వారు సూపర్ మెన్ కారు గాని మామూలు మనుష్యుల కంటే భిన్నమైన వారు. చాలా గొప్పవారు అనే భావన కలుగచేసేలా ప్రవర్తించాలని నియమం. ఈ కారణం వలన ఐసిఎస్ అధికారుల ఆధిక్యతకు మచ్చవంటి అవినీతి, కుంభకోణాలు' వారి జోలికి రాలేదు. ఈ రుగ్మతలకు అతీతంగా వుంటే గాని పాలించటం సాధ్యం కాదు. దారి తప్పితే తీక్షణంగా చూసేవారు. అటువంటిది జరిగేదికాదు. ఈ శక్తి చాలని వారు ఆధిక్యతా గుణాన్ని అందుకోలేనివారు యింకా కింది ఉద్యోగాలలో సర్దుకునే వారు. ఎక్కడయితే తక్కువ నష్టం జరిగేదో ఆ చోట్లకు అల్ప ప్రజ్ఞావంతులు చేరే వారు.

అందుచేత ఐ.సి.ఎస్. వృత్తి మంచి పరిపాలకులని సృష్టించింది. అది ప్రపంచంలో కెల్ల గొప్పది కాకపోచ్చు. అది ఎందుకోసం ఏర్పడిందో ఆ లక్ష్యం సాధించడానికి అది తిరుగులేని ఆయుధం. అందుచేత స్వాతంత్ర్యం ఏర్పడ్డాక ఐ.సి.ఎస్. వర్గం ఉత్తమమైనది అని చెప్పజాలము. మంత్రులకి 'నో' చెప్పడం అన్ని సందర్భాలలోను సరైనది కాదు. కొన్ని సందర్భాలలో మంత్రులపట్ల ఐ.సి.ఎస్. అధికారులు అంత కఠినంగా వుండనవసరం లేదు. ఐ.ఏ.ఎస్. వారికంటె ఐ.సి.ఎస్. వారు మంత్రులకు ఎక్కువ 'నో' చెప్పినప్పటికీ స్వాతంత్ర్యానంతరం వారి పాత్ర ఎటువంటిదో చెప్పడం సాధ్యం కాదు.

ఇటీవలి కాలంలో సివిల్ సర్వీస్ అనేది పతనం చెందింది అనేది నిర్వివాదాంశం. ఈ పతనానికి ఐ.సి.ఎస్. లేదా ఐ.ఏ.ఎస్. సర్వీసులలో చేరుతున్న వ్యక్తులు వారి ప్రతిభ ఎంత మాత్రం కారణం కాదు. సివిల్ సర్వీసుకి వుండవలసిన లక్ష్యాలు కొన్ని విలువలు వీటిపట్ల నిబద్ధత లేకపోవడం అనేది పతనానికి విలువల తుడిచివేతకు కారణం. స్వాతంత్ర్యానికి ముందు ఆ లక్ష్యం ఒకటి వుండేది.

స్వాతంత్ర్యానికి ముందు వున్న సివిల్ సర్వీసు ఉద్యోగులకు స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, సోషలిజం వీటిపట్ల నిబద్ధత కలిగి వుండాలి - వుంది. మొదట్లో పనిచేసింది. వీటికి ప్రతిఘటన ఎట్నుంచీ రాలేదు. స్వాతంత్ర్యోద్యమ స్వభావం నుంచి ఉత్పన్నమైన విలువలు జాతికి సరిపడిన విలువలుగా నిలిచాయి. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న తరం వారు జాతి విలువలను అందుండి స్వీకరించి వాటిని కీర్తించారు.

క్రమంగా పరిస్థితి మారింది. స్వాతంత్రోద్యమ జ్ఞాపకాలు మరుగునపడ్డాయి. కొత్త తరం వారు వచ్చి రాజ్యాంగంలో నిర్దేశించిన విలువలను ప్రశ్నింపసాగారు. ఆ విలువల తీవ్ర సంఘర్షణలో సివిల్ సర్వీసుల్ని కూడా వదిలిపెట్టలేరు. ప్రతి పార్టీ యీ సర్వీసుల నుంచి ఎక్కువ ప్రయోజనం పొందాలని ఆశించింది. ఎవరి లాభం వారిది.

రాజ్యాంగ విలువల పట్ల నిజమైన కమిట్‌మెంట్ వారికి వుంటే సివిల్ సర్వీసులు ప్రయోజనకరమైన సేవలు గట్టిగా నిలబడిచేసి వుండేవి. పి.ఎన్. హక్సర్ అన్నట్లు కమిట్‌మెంటు అనేది అసహ్యకరమైన మాటగా మారిపోయింది. రాజ్యాంగం ఆమోదించినప్పటికీ ఆ విలవల పద్ధతికి నిబద్ధమై వుండటాన్ని ప్రోత్సహించలేదు. అటువంటి కమిట్‌మెంటు ఏదీ లేకపోవడంవలన అధికారంలో వున్న శక్తులకు తలవొగ్గి సర్వీసులో ముందుకు వెళ్తూ తాత్కాలిక ప్రయోజనాల్ని ఆశించమనటం తేలికఅయింది. ఈ మార్పులు వచ్చే సరికి దాదాపు ఐ.సి.ఎస్. వారంతా రిటైరయ్యారు. అందుచేత వారికి యీ అవస్థ పట్టలేదు. ఇప్పటి ఐ.ఏ.ఎస్. అధికారుల కంటె సర్వీసులో వుంటే భిన్నంగా వారు ప్రవర్తించే వారని అనుకోవడానికి కూడా వీల్లేదు. సివిల్ సర్వీసులో మాత్రామే గాకుండా యితర సర్వీసులలో కూడా విలువలు లేకపోవడానికి లేదా క్షీణించడానికి ఒక విలువల వ్యవస్థకు నిబద్ధత అనగా కమిట్‌మెంట్ లేకపోవడమే. నెహ్రూ యీ ప్రమాదాన్ని పసిగట్టి దూరాశాపూరితమైన వ్యవస్థ ఏర్పడకుండా హెచ్చరించాడు. జాగ్రత్తని ఆయన అభివృద్ధిని సహకార పంథాలో ఆశించాడు. పోటీ పడటాన్ని వ్యతిరేకించాడు. పోటీపడే వ్యవస్థలోని ప్రయోజనం ఏమిటంటే అక్కడ కష్టపడి పనిచేయాలి ప్రావీణ్యం సంపాదించాలి. అయితే ప్రోత్సాహకం వ్యక్తిగతమై లబ్ధిని ఆశించి కాని సామాజికం కాదు.

అభివృద్ధి చెందిన సమాజంలో వ్యక్తుల మధ్య పోటీ యితరుల హక్కులకు భయంకరం కాకుండా జాగ్రత్తగా నియమబద్ధంగా వుండేలా చూస్తారు. కొన్ని నియమాలకు లోబడి అది వుంటుంది. అభివృద్ధి చెందని దేశాల్లో ప్రజలు నిరక్షరాస్యులు. వారి హక్కులు వారికే తెలియవుగాన పైగా దేశీయ వనరులు పరిమితం కావడం వలన పోటీ మిక్కుటమై చివరికది దోపిడీకి దారితీస్తుంది. కాంపిటీషన్‌లోని అవకతవకలవల్ల దోపిడీ ఏర్పడుతుంది. దోపిడీ విస్తృతంగా వుండి లాభాలు అపరిమితంగా వుంటాయి. ఈ దోపిడీ మనస్తత్వం అన్నిటినీ చెరుస్తుంది. అన్ని వృత్తులూ వ్యాపకాలూ పోటీకి దోపిడీకి ఆలవాలమై నిజాయితీ, సత్యపాలన, అందరికీ న్యాయం, సమభావన యివన్నీ ఖర్చయిపోతాయి. నీతికి నిజాయితీకి స్థానమే వుండదు. అదే మనం యిప్పుడు అన్నిటా చూస్తున్నాము విలువల రాహిత్యం.

ఇన్నిటి మధ్య సైనిక వ్యవస్థ చెక్కుచెదరకుండా వుంది. దేశరక్షణ బాధ్యత వారి భుజస్కంధాలపై వుండటంవలన అది అలా గట్టిగా నిలబడివుంది. మిగతా విషయాలన్నీ

సర్వీసులో ప్రమోషన్లు, వ్యక్తిగత ప్రయోజనాలు అన్నీ దేశరక్షణ బాధ్యత తరువాతే. దేశం అందుకే గర్విస్తుంది. దేశం గర్విస్తున్నదని సైనికవ్యవస్థకూ తెలుసు. వారికి ఉత్సాహమే అది. బయటవున్న యీ అనారోగ్యకరమైన పోటీలనుండి వారిని రక్షించుకొంటున్నాయి. ఈ వ్యవస్థలోని అవలక్షణాలు వారిని అంటనియ్యకుండా కాపాడుకొని వస్తున్నాము. అయితే వారికి యివ్వవలసిన సౌకర్యాలు, పునరావాస సదుపాయాలు త్వరగా రిటైరయిన వారికి అన్నీ జాగ్రత్తగా చూడాలి. అన్ని విధాలా రక్షణ నివ్వాలి.

పౌరజీవనంలో అల్లర్లు కొట్లాటలు జరిగినప్పుడు సైనికుల్ని రప్పించి వారికి అదనపు అధికారాలిచ్చి పౌరులకి వ్యతిరేకంగా మిలటరీని వాడటం చాలా ప్రమాదకరమైన సంప్రదాయం. ఇతర దేశాల ఆక్రమణనుంచి దేశాన్ని రక్షింపవలసిన సైనికవ్యవస్థను దేశప్రజలకు ఎదురుగా వాడరాదు. ప్రజలను దేశాన్ని రక్షింపవలసిన సైనికదళాలను ప్రజలమీద ప్రయోగించడం వారిని నైతికంగా బలహీనపర్చడం క్రిందవస్తుంది. నైతికంగా మన సైనికదళాలను దిగజార్చే ప్రయోగాలకు స్వస్తి చెప్పాలి. యీ విషయంలో ఒక విషయం ఉదాహరణగా చెప్పాలి. 1967 సంవత్సరంలో ఫ్రాన్సులో విద్యార్థులు ప్రభుత్వానికి ఎదురు తిరిగి పెద్ద యాజిటేషన్ లేవదీసి, రోడ్లకు అడ్డాలుపెట్టి ట్రాఫిక్ బంద్‌చేసి నానా భీబత్సం చేసారు. అప్పుడు జనరల్ **డీగాలి** ప్రసిడెంటుగావున్న సమయంలో ఆర్మీ చీఫ్‌నీ పిలిచి మీరు కంట్రోలు చెయ్యండి. అవుసరమైతే ఆయుధాలు గూడా వుపయోగించండి అని చెప్పాడు. సారీ సార్ మేము సివిలియన్సు జోలికి పోము. అందులో స్టూడెంట్సు విషయం జోక్యం చేసుకోము అని సున్నితంగా చెప్పాడు.

మొత్తంమీద సివిల్ సర్వీసులలో ప్రారంభమయి క్షీణదశకు చేరుకుంటున్న విలువల రాహిత్యం పోవాలంటే జాతి మొత్తం విలువలమీద ఆధారపడే వ్యవస్థకు పునరంకితం కావాలి.

('స్టేట్స్‌మన్' పత్రికలో ఆర్.సి. దత్ విలువల విధ్వంసం - సివిల్ సర్వీసు అన్న వ్యాసం ఆధారంగా)

Like a great leader, Lenin did not absolve himself from his moral and political responsibility. He dictated a message which began with the opening words: "I am and I plead strongly guilty before the workers of Russia" that he had not acted with sufficient determination and early enough against Stalin and Drezezhinsky and against their great Russian chauvinism, against the suppression of the rights of the small nations and against the new bureaucratic oppression in Russia of the week by the strong. But for 33 years, till the 20th Congress of the CPSU in 1956, this great moral testament of Lenin was hidden from the Soviet people.

# స్వేచ్ఛ

డా. బెజవాడ గోపాలరెడ్డి

నేను కోరేది స్వేచ్ఛ. నా పరిసరాలు, నా మతము, నా భాష, నా బంధుత్వాలు నన్ను అణచుచు, కురుచ పరుస్తూ యున్నాయి. మంత్రబద్ధుని చేస్తున్నాయి. నాలుగు వైపులా మూయబడ్డ తలుపులే. నిషేధాజ్ఞల చేతులెత్తి అడ్డగిస్తున్నాయి. ఏమి చేయపోయినా మతము ఒప్పదని, వ్యాకరణము సమ్మతించదని, సంఘము అంగీకార అక్షింతలు వేయదని, మౌనముగ కనుసైగలు చేస్తున్నాయి. అన్నింటికీ బానిస యగుటకేనా నేను పుట్టింది. నా వ్యక్తిత్వము అసలు లేదా? అందరిలోనూ నేనూ ఒకరినేనా? నాదంటూ ఏమీ లేదా? అయితే నేను మహా ప్రతిధ్వనినా? ఇతరులు వదలిన మాటలను వల్లె వేసిన సరిపోతుంది. నా మెదడు పని చేయసక్కరలేదు, ఆపాద మస్తకము పాశముల బంధించుకొని, నిద్రపొయ్యే దేవుల లేపుచూ సుప్రభాతాలు పాడుకొంటూ, సూర్య నమస్కారాలు చేసికొంటుంటే సరిపోతుంది. అన్నెం పున్నెం ఎరుగని ప్రతిబింబముగ, ప్రతిధ్వనిగ, అహంబ్రహ్మీ అంటూ జపమాలను త్రిప్పుచుంటే సరిపోతుందా? ఎంత ఇరుకైనది మానవ జీవితము. ఎన్ని అడ్డుగోడలు, ముళ్ల కంచెలు చుట్టూ. మానవ జీవితము క్లిష్ట, జటిల పద్మవ్యూహమా? లోపల తిరుగుతుంటే జన్మ రాహిత్యమా? నిత్య స్వర్గవాసమా?

ఇట్టి సంకీర్ణ వాతావరణములో జీవించుటకేనా మానవుడు జన్మించింది. అడవిలోని పిట్టలకున్న స్వేచ్ఛ కూడా లేదా? సృష్టిలో ఉన్నత శిఖరములో కూర్చొని యున్న మానవుడు పాతకు ఊత వేస్తూ, ఇతరుల వీపుల చూస్తూ, అడుగు జాడలలో నడుస్తూ, మిగిల్చిపోయిన తిండిని తింటూ, నెమరు వేస్తుండటానికేనా మానవుని సృష్టించింది, అదేనా మానవ పరమ లక్ష్యము?

కాని, అన్నిటికీ తల యొగ్గినా, మానవుడు సుఖముగా ఉన్నాడా? ఎంతటి పేదరికము, ఎంతటి అనారోగ్యము! ఎంతమంది వికలాంగులు, గ్రుడ్డివారు, కుష్టువారు. అంతటితో ముగిసిందా మానవ విషాద గాథ. ఎన్ని అవగుణములు మానవునిమీద దండు వెడలుచు న్నాయి. ఎంత మదము, మాత్సర్యము, క్రోధము, ఎంత క్రౌర్యము, స్వార్థము. ఎన్ని కోర్కెలు, అలజడులు, ఆందోళనలు, బయటా లోపల శత్రువులు నీ ఆనందాన్ని, స్వేచ్ఛను హరించేవారు.

నేను ఉద్దేశించిన స్వేచ్ఛ ఇతరులకు హాని కలిగించేది కాదు. శీల వంచన చేసేది కాదు. హింసను ప్రోత్సహించేది కాదు, హక్కుల హరించేది కాదు. నేను వాంచించేది విప్లవమే, కాని అరాజకము కాదు. గళమునకు తల ఊపేది కాదు. ఉన్నా వర్తమానాన్ని ప్రశ్నించేది. చుట్టూ అలముకొన్నా నాచు గొలుసుల త్రెంచుకొనేది.

నాకు తెలుసు నా అవసరాలు, ఆవేశాలు, నా ఇంద్రియాల శక్తి సామర్థ్యాలు. నేను అందరివలెనే జీవించేవాడిని. కొన్ని పరిస్థితుల్లో అందరివలెనే, లేక ఎక్కువ మంది వలెనే స్పందించేవాడిని. మానవులతో సమాన స్పందనను పంచుకొనేవాడిని. ఎన్ని సమాన ధర్మాలున్నా, ఎక్కడో నాది అంటూ కొంత మిగిలియున్నది. అదే నా వ్యక్తిత్వపు ప్రత్యేకత. అదే నా స్వేచ్ఛను కోరేది. నేను నేనుగా మిగుల్చుకోవాలని కోరేది. ఆ కొంచెము నా సొంతము.

# — చలంతో - మధురవాణి —

ఊహాజనితం :

- పురాణం సుబ్రమణ్యశర్మ

చలంగారు ఒక చినిగిన పాత చీరముక్క లుంగీగా చుట్టుకుని పైన ఒక గళ్ళ బుష్షర్టు వేసుకుంటారు. పిండి రుబ్బుతూ లేచి వచ్చినట్లున్నారు. గడ్డం మాసింది బాగా, జుట్టు రేగివుంది. ముఖం ఈశ్వర తేజస్సుతో వెలిగిపోతూ వుంది.

మధురవాణి: నేనెవర్నో పోల్చుకోలేరా?

చలం (నవ్వి) : నువ్వు ఎంకి పక్క నిల్చోతగ్గ దానవు. ఎంకివి కావు. మహా పతివ్రతవు కావు. ఊర్వశివో, వసంత సేనవో...

మధురవాణి: గెయిషాని కాన్నేను. అప్పారావుగారి అందమైన పాపాన్ని.

చలం : Colourless iniquity ఇంత లేటుగానా రావటం?

మధురవాణి: శ్రీ శ్రీని విశ్వనాథని వీళ్ళందర్నీ నదుల్చుకుని వచ్చేసరికి యింత ఆలస్యమయింది.

చలం : నీ దగ్గరకి వచ్చే వాడి కళ్ళు మూసుకుపోవటం వెళ్ళేవాడి కళ్ళు తెరుచుకోవటమూ సహజమే.

మధురవాణి: సౌజన్యారావు పంతులు గారి ఆలోచనకు అందని సంగతులు మీరు ఆలోచిస్తారని–

చలం : సంస్కరించేటప్పుడు తప్ప సాంఘిక చట్టాల్ని మీరడం నేరమన్నారు అప్పారావుగారు. వివాహబంధాన్ని తృణప్రాయంగా మీరే వారందరూ సంఘ పూజ్యులే. ఇట్లా మీరే సంసార బంధంవల్ల లాభమేమిటి?

---

మిగతాది అందరితో పంచుకొనేది. నా కొంచెపు స్వేచ్ఛ నన్ను గిరి శిఖరాలకు తీసుకపోగలదు, కొండ లోయలకు కడలి లోతులకు తీసుకవెళ్ళేది. నన్ను పెంచగలదు, అణచగలదు. దాని బాధ్యత నాదే. విమానచక్రము నా చేతిలో ఉన్నది. నా ఇష్టమున్న దిక్కునకు, కోరే ఎత్తులో నడుపుకొంటాను. నడపలేకపోతే కూలిపోతాను. దాని బాధ్యత నాదే. మరెందుకు ఇది కూడదు, ఇది వలనుపడదు, అని 144 సెక్షనులు కర గోడలు, మెడను నులిపే చేతులు, కళ్లు మూసే అరచేతులు?

మతాలు, గ్రంథాలు, సాంప్రదాయాలు నా కొరకా, లేక వాని కొరకునేనా అని ప్రశ్నించుకొంటు స్వేచ్ఛను వాంఛించుచున్నాను.

నేను నా కొరకా, ఇతరుల కొరకా?

నేను 'బ్రతికియున్నవారి కొరకా, చచ్చిన వారి కొరకా?' అని ప్రశ్న పతాకాన్ని ఎగురవేస్తూ పోతాను. పోనీయండి.

---

మధురవాణి: అలా మీరనవసరం లేకుండా మనుషులు దొంగలు కాకుండా సంస్కరించమన్నం దుకు మిమ్మల్ని సాంఘిక, వాఙ్మయ, నైతిక బహిష్కారానికి గురిచేశారు అవునా?

చలం : ఆయన అన్న మాటల్నే సరిగా నేను అన్నందుకు కోపం నా మీద. ఏదో ఉద్రేకంలో ఉపోద్ఘాతాలు నేనడక్కుండానే వ్రాసి పశ్చాత్తాప పడేవాళ్ళూ, నన్నిష్టపడే వాళ్ళ వద్ద పొగిడి, ఇష్టం లేని వాళ్ళవద్ద తిట్టే వాళ్ళూ, ''మనిషి ఫరవా లేదుగాని ఆ వ్రాతలు'' అనే వాళ్ళూ, ''వ్రాతలతో ఆగితే బాగా వుండును'' అనే వాళ్ళూ - - ఇట్లాంటి మిత్రులకన్నా పడ పడ దూషించే విరోధులెంత ఉపకారులు?

మధురవాణి: మీరు ఆంధ్రా యూనివర్సిటీ నవలల పోటీకి వేయి పడగలు నారాయణరావుతో దీటుగా నవల సంసారట ఏవిటది?

చలం : మైదానం. లూ యీ సిన్‌క్లర్ ఓసారి అన్నాడు. మర్యాదకీ ధనవంతుల పద్ధతికీ ఎదురు తిరిగి రాస్తే ప్రతిభకల రచయితని అమెరికాలో కొనేస్తారట! లొంగిపోతే వెలేసి అనామకుణ్ని చేసి అతని గొంతు పిసికేస్తారు. నన్నా పనిచెయ్యలేకపో యారు యిక్కడ.

మధురవాణి: మరి ఆర్టిస్టుకి పాప్యులారిటీ మీద ధ్యాస వుంటుంది కదా!

చలం : వాడు దేవుళ్ళాడేదే పాప్యులారిటీ కోసం. అతన్ని ఆర్టిస్టు కాకుండా చంపేదే ఆ పాప్యులారిటీ. మర్యాదస్తుడివై పోయేము నీకు దాసుల మవుతాం అంటారు. ఏ టాగూరులాటి వాడో బెర్నార్డ్‌షాలాంటి వాడో లొంగరు వాళ్ళకు, లోకం కళని చిన్నతనంలోనే చంపేస్తుంది.

మధురవాణి: ఎట్లా వచ్చాయి. ఎంకి పాటలు?

చలం : ఎట్లా వొచ్చాయో ఒచ్చాయి ఒక్క గుంపుగా ఆయన హృదయాన్ని చీల్చుకుని, మరోలోకపు హంసల వలె. ప్రతి వారిలో భయపడి దాక్కొని వున్న శృంగార రేఖలు మామూలు దుమ్మొని చీల్చుకుని తలలెత్తిచూశాయి.

మధురవాణి: ఏంచేశాయవి?

చలం : ఏం చేశాయా? దేశంలో యింత గాలి దుమారం రేపి, కవిత్వపు చెత్తనంతా వూడ్చి కడుపులు మండించాయి. మడి కట్టుకుని వంటింటో కూచుని తానే శుచి అని విర్రవీగే కవిత్వాన్ని జుట్టు పట్టుకుని తోటల్లోకి చేలల్లోకి లాగాయి.

మధురవాణి: అప్పుడు ఎంకి ఏం చేసింది?

చలం : ఆగ్రహంతో శపిస్తామన్నారు పండితులు. నన్ను తీసుకుంటారా నడ్డివిరగొట్టనా అని బెదిరించింది. రసికులందరూ ఎంకి వెంటపడ్డారు. ప్రతి వారిలో భయపడి దాక్కొని వున్న శృంగార రేఖలు మామూలు దుమ్మొని చీల్చుకుని తలెత్తిచూ శాయి.

మధురవాణి: కవిగారు ఏమంటారు?

చలం : ఎంకొక్క దేవతై ఎలిసెనంటారు. ధిక్కారంలోకి దిగి ఎంకి ఆధిక్యత నిలిపారు. ఈ లోపల కవి యెదిగారు, వయసులోనే కాదు, అనుభవంలో, మర్యాదలో, కీర్తిలో, మన్ననల్లో. ''ఎంకి అన్న అపవాదు, ఈనాటిదే కాదు ఎన్నటికి పోదు'' అని విలపించాడు కవి.

మధురవాణి: ఎంకి మారిందా?

చలం : ఎంకిని తీర్థయాత్రలుకు పంపారు. గంగాస్నానం చేయించారు. విశ్వేశ్వరుడి తల తడిమించి, ఆశీర్వచన మిప్పించారు. కాని, నీ వాక్కు నిన్ను పట్టేస్తోంది. నీకోకులం వంశం లేవు అన్నారు. ఊర్వశి, హృదయేశ్వరి, కాంతం, కిన్నెర సాని, తెలుగుతల్లి పక్కన కూచోనియ్యలేదు ఎంకిని.

మధురవాణి: అప్పుడు వూరుకున్నారా సుబ్బారావుగారు?

చలం : నా ఎంకిని మీ సహపంక్తిని కూచోనియ్యరా! సరే, నాకూతురికి కులాన్నిస్తాను. ఈమె శృంగార దేవత. ఈమె మహాప్రతివ్రత. అయినా సరే నీ వంశం నీ మాటా అని తోసేశారు కిందికి కవితాస్వర్గం నుంచి. కవిబ్రహ్మ మండి పడ్డాడు. నీకో లోకం సృష్టిస్తానన్నాడు. సృష్టికి ప్రతిసృష్టి జరిగింది. ఆ లోకానికి రాణి ఎంకి.

మధురవాణి: ఎంకి మారిందా?

చలం : వాళ్ళు నిజంగా రాజా రాణీ అయ్యారు. పూర్వంమల్లే ఆడుకోవడమూ, వుత్తుత్త విరహాలు పడడమూ, చిన్న చిన్న శృంగార చేష్టలూ యిప్పుడు సిగ్గు పనుల య్యాయి. ఆత్మల మన్నారు. ప్రియులమని మరిచి దేవత్వం పూనారు. ఇప్పుడు కావి రంగు మడిబట్టకట్టుకుని కాళ్ళు ఎత్తి ఎత్తివేస్తుంది. తోటల్లో పరుగులెత్తదు. నవ్వరు. గెంతదు. కళ్ళు ముయ్యదు.

మధురవాణి: ఇదంతా సుబ్బారావుగారికి తెలుసా?

చలం : సుబ్బారావుగారు తెలుసుకోని దేమంటే, తాను పాట రాసినా, ప్రథమం నించి ఆ పాటకూ మామూలు శృంగారపు గీతం కాదు - వాటికి ఓ ఆత్మ వైశాల్యం, ఓ గంధర్వ విలాసం పట్టింది. అందువల్లే పల్లె పాటలకి లేని ఆధిక్యత ఎంకి పాటలకి పట్టింది. ఎంకి మొదటి నుంచీ యీ ప్రపంచాన్ని మించిన శృంగార వీధుల్లోనే విహరించింది. ఎంకి ప్రజల మనిషి కాదు. ప్రజల మన్ననలకి ఎన్నడూ ఆశించలేదు ఆమె. అసలు ట్రాజిడీ ఏమిటంటే ప్రజా వాఙ్మయం కింద ప్రజలు తీసుకోలేదు. సాహిత్యం కింద పండితులు తీసుకోలేదు.

మధురవాణి: పోనెద్దురూ 'ఎంకెవ్వరని లోకమెపుడైన అడిగితే వెలుగు నీడల వేపు వేలు సూపింతు' అన్నారు కవి.

చలం : కవి మారినపుడల్లా పాత్రకి నగిషీలు చెక్కుతూ కూర్చుంటే కొన్ని ఎదురు

తిరుగుతాయి. ఎంకికి Sophistieation వస్తే యింకే ముంది? బారిష్టర్ పార్వతీశం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయినట్లు—

మధురవాణి: పాత్ర రచయితని మించిపోతే వస్తుంది చిక్కు. దానికి ప్రత్యేక వ్యక్తిత్వం వస్తుంది. అల్లా వస్తే అది మీ చెప్పు చేతల్లో యిముడదు. నాకు మల్లే -

చలం : ఆ పాత్రను సృష్టించిన రచయితే చివరికి దానికి విరోధిగా మారతాడు పితృవాత్సల్యం చేత - అవి ఎదురు తిరుగుతాయి కూడా. కాంతం వృద్ధాప్యం రాసి మునిమాణిక్యం వారు ఆ తప్పే చేశారు.

మధురవాణి: నాకు వయసుందా? అప్పుడెలా వున్నానో యిప్పుడూ అలానే వున్నా - మాకు డిప్రీసియేషన్ వుండదు. వుంటే అప్రీసియేషనే కాని. మాతోబాటు మమ్మల్ని సృష్టించిన మీరూ వుంటారు. మీరు గీత దాటితే—

చలం : కూతురి సారె గదిలోకి తొంగి చూసినట్లు.

మధురవాణి: ఛీఛీ మాట మారుస్తా! మాలపిల్ల సినిమాలో గాంధీగారి మీద బసవరాజు గారి పాట వినిపించారు, గుర్తుందా?

చలం : గుర్తుండకేం? కోమటైబుట్టితేనేమీ, మా గాంధి మాలడై తిరిగితేనేమీ అని. ఏవిటా లేకి మాటలు? అయినా గాంధీని అంగీకరిస్తామని వెధవ కండిషన్లు. కుల ప్రసక్తి తేవడం నీచాతినీచం కదా!

మధురవాణి: మీరే అలా అనుకుంటే యిక నేనేమనాలి?

చలం : అప్పుడప్పుడు అనిపిస్తుంది - జీవితంలో విరామం లేని క్షోభనంతా యెందుకు తెచ్చి పెట్టుకున్నానా? అని. నన్ను ప్రేమించిన పెద్దలకి, ప్రియురాళ్ళకి, స్నేహితులకి, పిల్లలకి, కష్టం, విచారం, కోపం ఎందుకు తెప్పించాను? ఎందుకు పడ్డాను ఇన్ని కష్టాలు, యీవెలి, యీ నింద, యెన్నటికీ మాయని యీ అపవాదులు?

మధురవాణి: మీరు సత్యమని నమ్మిన దాని కోసం.

చలం : పర్యవసానం? ఏమీ కనపడదు విడవని వ్యధ తప్ప. లేని సత్యమనేది వుండనీ వుండక పోనీ, నేను యేనాటికి యేది సత్యమనుకున్నానో దాన్ని అనుష్టించ కుండా నిలవలేదు.

మధురవాణి: చిన్నప్పుడే ఆడపిల్లల గొడవల్లో పడ్డారటగా - మీ మొదటి గొడవ గుర్తుంటే చెప్పండి.

చలం : 'M' మొదటిసారి నా కళ్ళపడ్డప్పుడు, చిన్నది - యింకా పన్నెండేళ్ళులేవు. రెండు మాటలేవో, మాట్లాడగానే 'ఇన్నాళ్ళెక్కడ దాక్కున్నావు నాకు కనపడక' అన్నా. ఓసారి స్తంభం పక్కన ఆమెని ముద్దు పెట్టుకుంటో వుంటే చూసి భ్రమపడ్డారు. ''నేను పెళ్ళి చేసుకుంటాను'' అని అరవబోయి సిగ్గుతో నోరు మూసుకున్నా. ఎండాకాలపు మధ్యాహ్నాలు, నేను 'B' పాకలో మా పెట్టె

బండి విడిచి వుంటే, దాంట్లో యెక్కి కూచునే వాళ్ళం. వెడతానని అనకుండా ఓపికగా గంటల కొద్ది కూచునేది. ఆమె బుజానికీ, బండికీ మధ్య నా వేలు నలుగుతోంది. మెల్లగా నా మెడ కింద ఆమె పెదిమలు కదిలాయి. అది ముద్దు అవునా కాదా అని...

మధురవాణి: యీనాటికీ తర్కించుకుంటూ వున్నారు పాపం.

చలం : యిప్పుడు అడగితే బాగుండదు. మర్యాదస్తురాలు, పెద్ద కుటుంబానికి అధికారి యేమంటుంది?

మధురవాణి: మీ చిన్నతనం...

చలం : ఎదుగుతున్న ఆడపిల్లలతో, ఆటలతో, సరసాలతో నాటకాలతోనే గడిచింది ఆ కాలం. చిన్నప్పటి నుంచి దూరంగా వుండే నా బాలమిత్రురాళ్ళ కోసం యేడ్చే వాణ్ని.

మధురవాణి: మరి అంత చిన్నప్పుడే పెళ్ళి ఎందుకు చేసుకున్నారు?

చలం : చిన్నప్పుడేవిటి? 1911లో స్కూల్ ఫైనల్ చదివే నాటికి పెద్దల బలవంతంతో నా పెళ్ళి జరిగింది. కారణం లేకుండానే నాకు పెళ్ళి అంటే అయిష్టం. అదిగాక అప్పటికే నాకు ముగ్గురు చిన్న పిల్లల మీద ప్రేమ. కుల వివాహ పట్టింపుల వల్ల చేసుకోలేను. వాళ్ళతో కలిసివుండటానికి వీల్లేదు. ఎంతో బాధపడుతున్నా. గుంజుకున్నా. నీకు పెళ్ళి వద్దని గోలపెట్టా. పారి పోదామని అనుకొన్నా. ఇల్లు కదలనివాడిని, సుకుమారిని, అర్భకుణ్ని. అనారోగ్యుణ్ని నేనెక్కడికి పోగలను?

మధురవాణి: మీ యింటి పేరు గుడిపాటి ఎలా అయింది?

చలం : మా తాత మాతామహుడు గుడిపాటి వెంకట్రామయ్యగారు సెటిల్ మెంటు ఆఫీసరుగా రిటైరయారు. దివాన్ బహద్దరు కూడా. ఆయన నన్ను దత్తత తీసుకున్నారు. మా నాన్నా కొమ్మూరి సాంబశివరావు, వెంకట సుబ్బమ్మ మా తల్లి. నాకు పుట్టుకతో పార్శ్వపుతలనొప్పి (మైగ్రేన్) వుండేది.

మధురవాణి: ప్రేమకోసం ప్రేమించబడడం కోసం అంత యావ చిన్నప్పుడే ఎలా ఏర్పడింది?

చలం : మా నాన్న అస్తమానూ నన్ను కొట్టే వాడు. చదువు పేరు చెప్పి కొట్టే వాడు. నా చిన్నతనమంతా అనారోగ్యంతో తండ్రి పట్ల ద్వేషంతో గడిచింది. నేను అమ్మానాన్నల ప్రేమ ఎలాంటిదో ఎరుగను. ఆ కఠిన తరమైన గాఢముద్ర ద్వేషం తరువాత జీవితంలో ప్రేమ కోసం, ప్రేమించి ప్రేమించబడటం కోసం అన్వేషణగా మారిందనుకుంటా.

మధురవాణి: మీరు చిన్నప్పుడేవో ప్రతిజ్ఞలు చేశారట?

చలం : యెన్నటికీ పెళ్ళి చేసుకో గూడదనీ, పెద్దవాళ్ళు బలవంతాన చేసినా పిల్లల్ని కనగూడదనీ, పిల్లల్ని కన్నా వాళ్ళను యేడ్పించకూడదనీ, వాళ్ళు యేడ్చినా యేమైనా సరే, వాళ్ళను కొట్టగూడదనీ అనుకున్నా తీవ్రంగా.

మధురవాణి: మొక్కపాటి రామమూర్తి ఎవరు? రత్తమ్మ...

చలం : రామ్మూర్తి బారిష్టరు పార్వతీశం రాసిన మొక్కపాటి నరసింహశాస్త్రిగారి తమ్ముడు. బ్రహ్మ సమాజంలో కలిసి మాతో వున్నాడు. కృష్ణశాస్త్రి కృష్ణపక్షం ముద్దుకృష్ణ వైతాళికులు అంకితం తీసుకున్న గొప్ప మిత్రుడు. నేను నా మొదటి నవల రామ్మూర్తికే శశిరేఖని అంకితం యిచ్చాను.

మధురవాణి: కృష్ణశాస్త్రి ఊర్వశికి...

చలం : అవును రత్తమ్మ. రామ్మూర్తి మరదలు. కొన్నాళ్ళు నావద్ద పాఠాలు చెప్పించుకొనేది. మేమిద్దరం ఆబలమైన ఆకర్షణ నుంచి బైటపడలేకపోయాం. రామ్మూర్తి చాలా బాధకు గురయ్యాడు. చలానికి దూరమయినా మళ్ళీ కలుసుకున్నాడు. చివరికి సూళూరుపేట రైల్వే ఆక్సిడెంట్‌లో రత్తమ్మ పోయింది పాపం.

మధురవాణి: రాను! రాను! మీ ఆదర్శ స్త్రీ...

చలం : లోప రహితమైన ఈ భూమి **Limitations** మించి సంచరించే ఓ స్త్రీ నాతో మెలుగుతో వుండేది. ఆమె నా స్వప్నచారిణి. ఆమె యీ భూమిమీద అలభ్యమని తెలుసు. అందుకనే నేను ప్రయత్నించి, ఉన్నతుణ్ణయి, ఆమెను అందుకోవాలని చూసే వాణ్ని. నేను వాంఛించే వెలుగు వైశాల్యం అన్నీ ఆమెలో లభ్యమవుతాయని ఆశపడే వాణ్ని: ఎక్కడ? ఎక్కడ? ఎక్కడ అనే అన్వేషణ నన్ను ఆవరించింది.

మధురవాణి: దీక్షితులు గారికి మీకు ఎలా కలిసింది?

చలం : రాజమండ్రి ట్రయినింగ్ కాలేజీలో 1922-23 ప్రాంతాలలో టీచర్‌గా వుంటున్నప్పుడే దీక్షితులుగారితో పరిచయం అయింది. నాచేత రుక్మిణి అనే మొదటి కథ రాయించి కొడాలి ఆంజనేయులు గారి సాహితిలో వేసేలా చూశారు. నన్ను కథకుడుగా ఆంధ్ర దేశానికి పరిచయం చేసింది వారే. 1936లో నన్ను రమణ మహర్షి దగ్గరకు తీసికెళ్ళి భగవాన్‌ని పరిచయం చేసిందీ దీక్షితులు గారే అంతా నన్ను తిట్టే రోజుల్లో సనాతనుడైనా సూన్రుతంతో, నిష్కాపట్యంతో, నన్ను సమర్థించే వారు.

మధురవాణి: మీరు బ్రహ్మ సమాజంలోకి ఎలా వెళ్ళారు?

చలం : రఘుపతి వెంకటరత్నం నాయుడు గారంటే నాకు భక్తి ప్రేమ, గౌరవం. ఆయనవల్లనా జీవితం నైతికంగా ఆధ్యాత్మికంగా చాలా ఇన్‌ఫ్లుయన్స్ అయింది. నేను కాకినాడ కాలేజీలో చేరి బ్రహ్మసమాజ ప్రార్థనలని చూడగానే నాకు చాలా సహజమైన చోటుకి వొచ్చినట్లు అనిపించింది. నాకు నీతి వర్తన మీదపట్టుదల ఎక్కువయింది. నాశశిరేఖ నవలలో కొంత వుంది ఆ గొడవ.

మధురవాణి: మళ్ళీ అందులోంచి ఎలా బయటికి వచ్చేశారు?

చలం : జీవితంలో నైతిక సమస్యలు ఏర్పడేటప్పటికి ఈశ్వరుడిపై ప్రశ్నలు బయలుదేరాయి. రత్తమ్మ కారణం బయటికి కొచ్చెయ్యడానికి. భార్యతో లేని పాపం

ఇంకొక స్త్రీతో పాపం యెట్లా అయింది?

మధురాణి: అసలు మీకీ ఆడవాళ్ళ గొడవ ఎందుకు పట్టిందీ?

చలం : నేను చదువుకునే రోజుల్లో నా పెద్ద చెల్లెలు అమ్మణ్ణికి భర్తపట్ల ఆమె కిష్టం లేకున్నా శోభనం ఏర్పాటుచేశారు. అప్పుడు మా బావకి ఉత్తరం రాశాను. ఆమెకిష్టం లేదు రావద్దని ఆ రాత్రి అమ్మణ్ణిని గదిలోకి పంపేవరకు యత్నించాం అడ్డుపడదామని. కాని అమ్మణ్ణి లొంగిపోయింది. మేమేం చెయ్యలేక పోయాం. మా నాన్న నన్ను కొట్టడానికి వచ్చాడు. తిరగబడ్డాను. బైటకి గెంటారు. గర్భాదానం గదిలో ఆడపిల్లలు ఎట్లా మారిపోతారో ఆశ్చర్యం వేస్తుంది. ఇది నా స్త్రీ విమోచనా సంగ్రామానికి ప్రేరణ.

మధురవాణి: మీ జీవితంలో అనేక మంది స్త్రీలు వచ్చి వెళ్ళారు. ఇంతమందితో ప్రేమ ఎట్లా సాధ్యం?

చలం : ఎంత ప్రయత్నించీ శృంగార వాంఛని ఈనాటి వరకూ జయించలేకపోయాను. అదే లేకపోతే నేను ఎందుకు బతికి? స్త్రీతో కొన్నాళ్ళు స్నేహమైతే, మాలోని శృంగార భావం పాతబడి, ఇంక నన్ను ఆకర్షించడం మానేసేది. అప్పుడు యింకో కొత్త శృంగార సంబంధం కోసం కొట్టుకునే వాడ్ని. ఇది గొప్ప ప్రేమా కాదు. ఉత్తకామమూ కాదు. ఇవన్నీ వాంఛలూ విరహం...

మధురవాణి: మీరు ఆడపిల్లలతో వున్నప్పుడు చాలా చలాకీగా కలిసీ మెలసీ వుండేవారను కుంటా—

చలం : అదంతా Calf love (లేగ దూడ ప్రణయం). హైస్కూల్లో నా పన్నెండవ యేట నొక అమ్మాయికి ప్రేమలేఖ కూడా రాశా. ఆడపిల్లలతోనే ఎక్కువ స్నేహం. Life is a habit బళ్లో నా స్నేహితులకి నన్ను చూడగానే నిష్కారణమైన అయిష్టం. నా జాతకంలో జనద్వేషానికి గురికావాలని వుంది కాబోలు.

మధురవాణి: మీ ఆదర్శ స్త్రీయేమైంది?

చలం : ఆదర్శ పురుషుడు లేకుండా ఆదర్శ స్త్రీ యెక్కడ్నుంచి వొస్తుంది? ఇది తెలుసుకోటానికి నాకు చాలా కాలం పట్టింది.

మధురవాణి: మరీ అభిప్రాయాలతో వేరుపడేనాటి పెద్దల గురించి ఏమంటారు?

చలం : (నవ్వి) వాళ్ళా? ఆ దయాపరులు రక్తం చూస్తే భరించలేని (......) వీళ్ళందరిలోనూ యెంతెంత క్రూరత్వం దాక్కొని వుందటారు? ఆ వేట కోర్కెలని తీర్చుకోక, దాచుకొని, ఉన్నదని కూడా తెలీక, పిట్టల మీద, మృగాల మీద చూపని ఆక్రౌర్యాన్ని, మనుషుల మీదా, కోర్టులలో, ఆఫీసుల్లో యిళ్ళలో తీర్చుకుంటారు కక్షలు కట్టి, మృగాల బదులు మనుష్యుల్ని, ధనాన్ని, పదవుల్ని వేటాడుతున్నారు. పిల్లల మీద, భార్యమీద, నౌకర్లమీద చూపుతారు కసి. వీళ్ళందరూ శాకాహారులే. భూత దయాపరులే—

మధురవాణి: ఆంధ్ర విశ్వవిద్యాలయం సెనెట్‌లో రామలింగారెడ్డి గారిని చూడగానే ఏమనిపించింది మీకు?

చలం : ఆయన్ని చూడగానే నా కళ్ళు చెదిరాయి. నేను స్త్రీనయితే సంసారాన్ని వొదిలి, ఆయన కోసం వెళ్ళి వుండనా?

మధురవాణి: రామ్మూర్తి చనిపోయాడని టెల్లిగ్రాం రాగానే మీకేమని పించింది?

చలం : ఈ సంగతి రామ్మూర్తితో చెప్పాలి అని. బతికివున్న వాళ్ళు మనతో తగాదాలాడి విరోధులు కావచ్చు. పెళ్ళిళ్ళు చేసుకుని మర్యాదస్తులయి మనకి దూరం కావచ్చు. కాని మనం ప్రేమించిన వాళ్ళు మృతి పొంది మన స్వంత మయిపోతారు.

మధురవాణి: స్త్రీల చూపుల్ని గురించి చెప్పండి ఎలా చెబుతారో విందామని.

చలం : పురుషుణ్ని వెదుక్కోడానికి అలవాటయిన స్త్రీ చూపులు అదో విధం. వేశ్య చూపులు వేరు. అవి ధనం కోసం వెతుకుతాయి. ఈ స్త్రీల చూపులు మోహం కోసం - కాదు. అవయవాల కోసం వెతుకుతున్నాయా అన్నంత అసహ్యంగా వుంటాయి. కొంత మంది స్త్రీలలో ఆకర్షణ - ఎంతయినా కళ్ళ వేపూ పెదవుల వేపే నిలుస్తుంది.

మధురవాణి: పాపం పోతనగార్ని ఏడిపించారటగా (నవ్వు)

చలం : నేనా? అవును. 'అన్యకాంతలడ్డంబైన మాతృభావన సేసిమరలు వాడు' అన్నాడు. ప్రహ్లోదుడ్ని గూర్చి. ఐదేళ్ళ పిల్లాడికి అన్ని ఆలోచన్లా అనివిస్తుపోయా.

మధురవాణి: మీది శ్రీరాముడి పార్టీయా? శ్రీకృష్ణుడి పార్టీయా?

చలం : తన ధర్మమేదో రాముడికి తెలీదు. ప్రజలు తప్పు అనుకున్న దాకా చరబడ్డ భార్యని స్వీకరించి గర్భవతిని చెయ్యడంలో యేమీ వికృతం కన్పించలేదు అతనికి. సీతని పరిత్యజించాలని వశిష్ఠుడు బోధించిందాకా అతనికి కర్తవ్యం తెలీలేదు ఆ చక్రవర్తికి. ఇన్ని శాస్త్రాలు చదివిన ఆ ధర్మస్వరూపుడికి, తన కర్తవ్యం తెలిసింతరవాతయినా, సీతతో యెదుట పడి మాట్లాడలేదు. అతని బాధ, ధర్మనిష్ఠా' అంత మహాపతివ్రతలా అర్థం చేసుకోదని భయం. పిల్లల కోసమన్నా తగాదా పెడుతుంది. అందుకని ఆ అబద్ధం వాల్మీకి ఆశ్రమం చూపిస్తామని, ఈ ఘోరాలన్నిటిలోనూ **రాముడు యెంత అల్పుడయినాడో యినాటికీ తెలీదు ప్రజలకి.**

మధురవాణి: అట్లా ధర్మానికీ హృదయానికీ మధ్య మధనపడే పాత్రని సృష్టించాలనుకున్నాడేమో వాల్మీకి.

చలం : అట్లా అంటే తగాదా యేదీ? ఆదర్శ పురుషుడు అంటేనే తనూ. శ్రీకృష్ణుడే అయితే' ఎవడివిరా నా భార్యనే యెంచుతావా?' అని వాణ్ని హతమార్చి వుండును. ఎన్నటికీ వశిష్ఠుడ్ని అడగడు. అసలు నోరెత్తనీడు. ఒక్క సీతతో

రాముడికి ఇన్ని సమస్యలు. పదహారు వేల మందితో ఏ సమస్యాలేదు శ్రీకృష్ణుడికి. నువ్వు విష్ణుమూర్తి అవతారానివి అని చెప్పాలి శ్రీరాముడికి. నేనే భగవంతుణ్ని అని శ్రీకృష్ణుడికి తెలుసు.

మధురవాణి: గాంధీ గారి గురించి మీరే మంటారు?

చలం : మహాపురుషులు ప్రపంచానికి రెండు విధాల ఉపకరిస్తారు. కార్యాలవల్లా, బోధనల వల్లా. రెండోది తమ దర్శన సాంగత్యాల వల్లా. గాంధిగారిని ఎరిగిన వారు ఆయన పనులకన్నా వ్రాతకన్న ఆయన గొప్ప వారంటారు. అంటే నిజమైన గొప్పదనం సంపాయించారన్న మాట. ఎందుకంటే మనిషి ఎంత లోపలి గొప్పతనం సంపాయిస్తే, అంత నిలువా, బరువూ అతని పనులూ మాటలూ ఈ సంగతే చాలామంది ప్రజానాయకులు గమనించరు.

మధురవాణి: వీరేశలింగం గారు ఏమవుతారు మీకు?

చలం : ఏ పద్ధతిలో నన్నా ఒక మూల గట్టిగా వూపే యోధుడు బైలుదేరాడు, తక్కిన బిల్డింగు అంతా త్వరలోనే కూలుతుంది. వితంతు వివాహాలు సాధించిన వీరేశలింగంగారు స్త్రీ నీతి చట్టాల్ని వెక్కిరించిన 'చలం'కి స్పిరుచ్యువెల్ ఫాదర్.

మధురవాణి: కథలు బాగా రాయటానికి చదువుకోవాలా?

చలం : చదువుకోకపోతే యింతకన్నా మంచికథలు రాద్దును. రాయగల టాలెంట్ మనిషిలో వుంటే, చదువూ పాండిత్యం చాలా అనవసరం.

మధురవాణి: శ్రీ శ్రీ మీకు ఎట్లా పరిచయం?

చలం : రుక్మిణీనాథశాస్త్రిగారు నాకు శ్రీ శ్రీ కవిత్వానికి కళ్ళు తెరిచారు.

మధురవాణి: కమ్యూనిజం గురించి మీరేమంటారో వినాలని వుంది.

చలం : కమ్యూనిజంలో వుండే గొప్పశక్తి యేమిటంటే, ఏ విషయాన్నయినా సరే - ఆరోగ్యము, విద్య, ఆర్థిక విధానము, దేవుడు, నీతి, దేనికయినా సరే - పాత బూజుల్ని దులిపి, ఈనాటి ప్రజాక్షేమపు దృష్టితో చూడగలగడం. పెద్ద బలహీనతేమంటే కమ్యూనిజ సిద్ధాంతం లోంచి తప్ప, దేనినీ చూడలేక పోవడం, దానికి విరుద్ధమయిన దాంట్లో సత్యంకనపడక పోవడం. ఎంత తర్కంతోనూ, సత్య ప్రదర్శనంతో కూడా కమ్యూనిష్టు విశ్వాసాన్ని చలింపుచెయ్యలేము. అదే వాళ్ళ బలం.

మధురవాణి: కమ్యూనిజానికి తిరుగు లేదంటారు. అవునా?

చలం : కాని, యెంతగట్టి విశ్వాసాలూ, ప్రపంచ చరిత్రలో వాటి గుడ్డి తనంవల్ల అవే బద్దలై, నూతన సత్యాలకి దారితప్పుకుని ఊడ్చుకుపోయినాయి.

మధురవాణి: శ్రీ శ్రీ మహాప్రస్థానానికి మీరు రాసిన పీఠిక అన్నం కంటె ఆవకాయ ఎక్కువయినట్లు... (నవ్వుతుంది)

(ముగింపు వచ్చే సంచికలో)

# సంపాదకునికి ఒక లేఖ

చీమకుర్తి శేషగిరిరావు

ఆర్యా,

నవంబరు 'మిసిమి'లో 'మధురవాణితో వీరేశలింగంపంతులు' అను రచనలో 'మంగమ్మ వ్యవహారము'ను ప్రస్తావించుచు కొన్ని సత్యదూరములగు విషయములను రచయిత తెలియజేయుట శోచనీయము. ఆ వ్యవహారమున పంతులు నడపిన క్రిమినల్ కేసులలో ఆయన ఓటమిని చవిజూచుటయేకాక, తుదకు రు.500/-ల నష్టపరిహారమును టంగుటూరు శ్రీరాములుకు చెల్లించి బయటపడెను. ఆ సంఘటనలకు సమకాలికుడై, తత్సంబంధితులతో పరిచయము కలిగిన రామచంద్రుని వెంకటప్ప - గుళ్లపల్లి ఆదినారాయణ షష్టిపూర్తి సంచికలో - టంగుటూరి శ్రీరాములు జీవిత, వ్యక్తి విశేషములను తెలుపుచు, మంగమ్మ వ్యవహారకాండను వివరించెను. ఆ వ్రాతను యథాతథముగ ఈదిగువ ఇచ్చితిని. యథార్థవిషయములు అందువలన విశదములు కాగలవు.

''స్వర్గీయ కందుకూరి వీరేశలింగం పంతులుగారి భార్య 1910లో కీర్తిశేషురాలయినది. అప్పటికి పంతులుగారికి షష్టి గడచినది. 1911నుంచి వ్యాధిగ్రస్తులు, వృద్ధులు అయిన పంతులుగారికి, వారి వితంతు శరణాలయంలో వుండిన 'మంగమ్మ' అనే ఒక బాలవితంతువు కొంతకాలము వంటచేసి పెట్టడము మొదలయిన శుశ్రూషలు చేస్తూ వుండేది.

'పరసతి సంగతి నుండిన
పురుషుడు గాంగేయుడైన భువి నిందపడున్'

అన్నాడుగదా సుమతీ శతక కర్త.

'పాలతి దావవాహ్ని; పురుషు డాజ్యఘటంబు
కరగకుండరాదు గదిసెనేని.

అని పోతనామాత్యుని భాగవతోక్తి. ఆనాటివారు అలా కొందరు. ఇలాకొందరు భావించారు. రెండవవాదనే ధ్రువపరచుకొన్న శ్రీరాములుగారు వూరుపేరు సూచించకుండా 'A lost reformer' (జారిపోయిన సంస్కర్త) అని ఆంగ్లంలో పద్యాలు కొన్నివ్రాసి తమ కార్లీలియన్ పత్రికలో ప్రచురించారు. ఇంతలో 'ఆంధ్ర' అనే ఇంగ్లీషు పత్రిక (గుంటూరు) ఆంధ్రప్రముఖుల జాబితా నొకటిని ప్రచురించింది. కాని అందులో వీరేశలింగంగారి పేరు చేర్చలేదు. అందుకు బొంబాయిలో ప్రచురమయ్యే 'సోషల్ రిఫార్మర్' అనే పత్రిక అంగలార్చింది. కార్లీలియన్‌లో దానిపై శ్రీరాములుగారు 'వీరేశలింగంగారు పుత్తములు కారు' అని సంపాదకీయమే వ్రాశారు. ఆ సందుకట్లలోనే నాళం కృష్ణారావుగారి సంపాదకత్వములో వెలువడుచుండిన 'మానవసేవ' అనే తెలుగు వారపత్రికలో 'నీతిబోధకుడు' అనే శీర్షికతో నీతిబోధకుడికి పాపపురుషునికి జరిగినట్లుగా ఒక సంభాషణ శ్రీరాములుగారి రచన ప్రచురమైంది. ఆ పత్రికకు సంబంధించిన వారిమీదను, శ్రీరాములుగారిమీదను ఒకటిన్ని, శ్రీరాములుగారిమీద ప్రత్యేకముగా ఒకటిన్ని, రెండు క్రిమినల్ కేసులు తేవడానికి వీరేశలింగం పంతులుగారు అంతా తయారుచేసుకొని ఆంధ్రపత్రికలో ఒక విజ్ఞాపన ప్రచురించారట! ఆ విజ్ఞాపనలో పేరుపెట్టకుండా తన్ను దూషించారని శ్రీరాములుగారు భావించి 1913 ఆగస్టులో పంతులుగారిమీద క్రిమినల్ కేసుపెట్టారు. 30-9-1913వ తేదీన అది విచారణ జరిగి కొట్టివేయబడినది.

''పంతులుగారు అంతటితో విడువక 4.10.1913 తేదీన తాము సంకల్పించియున్న రెండు క్రిమినల్ కేసులను కోర్టులో దాఖలు చేశారు. అందులో మొదటికేసు నీతిబోధకునికి సంబంధించిన దానిపై. అది పంతులుగారికే చెందినా, ప్రజాహితకరమయిన వ్రాత అని తీర్పు యిచ్చి సబ్‌కలెక్టరు స్టూవర్టుదొరగారు కొట్టివేశారు. రెండవకేసు కూడా విచారణ నడిచింది. రెండు కేసులలోనూ బారిష్టర్ ప్రకాశం పంతులుగారు తమ్ముని తరవున కేసులు నడిపారు. వీరేశలింగంగారిని మొదటికేసులో 5,6 రోజులు క్రాస్ పరీక్ష చేశారు. అన్నీ వొప్పించారు. రెండవకేసులో 'గ్రంథచౌర్యము' కూడ ఒక అంశమట. ఈ కేసులోకూడా వీరేశలింగం పంతులుగారిని ప్రకాశంగారు 5,6 రోజులు క్రాస్ పరీక్షచేశారు. తుదకు కేసు పెడతిరుగుతున్నదని తెలిసికొని వీరేశలింగం పంతులుగారే ఆ రెండవకేసును విత్‌డ్రా చేశారు. తమపై ఖావేషితో పంతులుగారు యీ క్రిమినల్ కేసులను తెచ్చారని శ్రీరాములుగారు రు.1500/-లకు నష్టపరిహారానికి దావా వేశారు. కోర్టువారు రు.500/-లకు మాత్రము తీర్మానించారు. పంతులుగారు హైకోర్టుదాకా వెళ్లినా అదే ఖాయమయినది. ఆ రు.500/-లను శ్రీరాములుగారు వసూలు చేసుకొన్నారు. నాడూ, నేడూకూడా ఆంధ్రులంతా బ్రహ్మరథం పడుతూవున్న వీరేశలింగంగారిని విమర్శించడము, వారు తెచ్చిన క్రిమినల్ కేసులలో గెవడమూ, నష్టపరిహారముకూడా రాబట్టుకోవడమూ శ్రీరాములుగారి పట్టుదలకే కాక ప్రజాసేవకుల సత్ప్రవర్తనయందు వారికిగల జాగృతికూడా తెల్పుతాయి. ఈ మాత్రమయినా వివరాలివ్వకపోతే అపోహలకు కారణమౌతుందని యిచ్చానేగాని వీరేశలింగం పంతులుగారియందు అలసభావము సృష్టించడానికి కాదు. పంతులుగారికి ఎన్నడో శతజయంత్యుత్సవం జరిగిపోయినది. వారు చరిత్రలో లీనం అయిపోయినారు. చారిత్రక పురుషులగూర్చి వృత్తాంతాలు వెలుగునీడలతో తెలుసుకోవడము దూష్యంకాదు.''



పేదరికం  శ్రీ చిత్రాలయం, త్రివేంద్రమ్

చిత్రకారుడు రాజా రవివర్మ

MISIMI/ మిసిమి RNI Regd No.45042/90 Telugu Monthly Hyderabad-500 020

Postal Regd. No.H/SD/191



చిత్రకారుడు రవి వర్మ

మలబారు స్త్రీ